ప్రజాశక్తి

స్నేహ

ఆదివారం అనుబంధం

డిసెంబరు 25, 2016



ఎన్ని క్రిస్ట్మస్‌లో..!

ENTERED

KSR02B150C



విచిత్ర రూపాలు

రొటీన్ రొమ్యాన్‌టిక్ చిత్రాల నుండి హారర్ చిత్రాల వరకు నటనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసే బాలీవుడ్ తారలు ఇప్పుడు కొత్త చిత్రాల్లో హాలీవుడ్ విలన్‌లని పోలుండే పాత్రల్లో మరింత విభిన్నంగా కనిపించనున్నారు.... 'క్రిష్-3' చిత్రం ద్వారా ఇప్పటికే హాలీవుడ్ క్యారెక్టర్స్ 'వైపర్', 'క్యాట్ ఉమన్'లని పోలిన ఒక వింత రూపంతో ప్రేక్షకుల మనసు దోచుకుంది కంగనా రనౌత్. 'ది డార్క్ నైట్', 'సైలెన్స్ ఆఫ్ ది ల్యాంబ్స్', 'బ్రేకింగ్ బ్యాడ్', 'ట్విలైట్' హాలీవుడ్ చిత్రాల్లో 'జోకర్', 'హన్నీబాల్ లెక్టర్', 'వాలటర్ వైట్'', హైసెన్ బర్గ్', 'అరో ది వ్యాంపైర్' పేరొందిన నెగటివ్ రోల్స్. విలక్షణంగా ఉండే ఈ పాత్రలతో ఒక ఫొటో షూట్‌లో పాల్గొన్నాడు ఎమ్రాన్ హష్మీ. ఎఫ్‌హెచ్‌ఎమ్ ఇండియా మ్యాగజైన్ కవర్ కోసం వేసుకున్న మేకప్పే అయినా మన హారర్ చిత్రాల్లో విలన్ గెటప్‌లని తలదన్నేలా ఉన్న ఈ ఫోటోలన్నీ నెట్టింట్లో అందరినీ గగుర్పాటుకి గురిచేస్తున్నాయి. శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'ఎంధిరన్ 2.0'లో నటిస్తున్న అక్షయ్ కుమార్ 'క్రో మ్యాన్'గా దర్శనమివ్వనుంటే 'సీక్రెట్ సూపర్ స్టార్'లో మ్యూజిక్ డైరెక్టర్‌గా ఒక వింత గెటప్‌తో తెరముందుకు రానున్నాడు అమీర్ ఖాన్.

KSR02B150



విద్యార్థి దశలో కంటిచూపును కోల్పోయాడు రాజ్‌దీప్. అందరూ అనుకున్న విధంగా తన ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. కుటుంబ పోషణ కోసం పనిలో చేరినా గోల్డ్‌మెడలిస్ట్‌గా పైచదువులని పూర్తి చేశాడు. ఉపాధ్యాయుడు అవ్వాలనుకున్న తన కలకు అడ్డుపడ్డ వైకల్యం, స్వరం రెంటిపై పట్టు సాధించి వేలాది మందికి రోల్‌మోడలయ్యాడు. ఆర్థిక శాస్త్రంలో ఆయన చెప్పే పాఠాలే కాదు తన ఉపన్యాసాలు నేటి తరం విద్యార్థులకు ప్రేరణనిస్తున్నాయి. వైకల్యం జీవితాశయాలకు అడ్డుకాదంటూ వికలాంగులకు ధైర్యాన్ని నూరిపోస్తున్న ఆయన ప్రసంగాలు, వారి సాధికారత కోసం తను చేస్తున్న కృషికి గాను భారత ప్రభుత్వం నుండి జాతీయ స్థాయి అవార్డును అందుకున్నాడు రాజ్ దీప్ మన్వాని.

ENTERED

చీకటిని జయించాడు

అతనిది అందరిలా సాధారణ జీవితం కాదు. ఒక పక్క అంగవైకల్యం మరో పక్క పేదరికం. ఈ రెండిటినీ జయించడం అంత తేలికైన విషయమేం కాదు. ఈ స్థితిలో ఉపాధ్యాయుడిగా మారడం అసాధ్యమని కొందరు అన్నా దాన్ని సాధ్యం చేసి చూపించాడు రాజ్‌దీప్(44). శ్రీ భగవాన్ మహావీర్ జైన్ కాలేజీలో రాజ్‌దీప్ చెప్పే ఆర్థిక శాస్త్ర పాఠాలను విద్యార్థులు ఒక్కరోజు కూడా మిస్సవడానికి ఇష్టపడరు. కొంచెం సాహిత్యం, కొంచెం చరిత్ర ప్రస్తావన, కాస్త వ్యంగ్యంతో ఆహ్లాదకరంగా కొనసాగే తన ఉపన్యాసాలన్నీ ఇతరులకి ప్రేరణనిస్తుంటాయి. దివ్యాంగుల జీవితాల్లో మార్పుకి కృషి చేయడానికి తను నేర్చుకున్న జీవిత పాఠాలే కారణమంటారు రాజ్‌దీప్. విద్యార్థి దశలో ఉన్న రాజ్‌దీప్ కంటిలో ఒక మచ్చ(మాక్యులర్ డీజనరేష్) ఏర్పడింది. రెటీనాపై తీవ్ర ప్రభావం చూపిన ఆ వ్యాధి ద్వారా దాదాపు 65 శాతం చూపుని కోల్పోయాడు. అప్పటి తన వయసు 13 సంవత్సరాలు. పదోతరగతిలో ఒక రోజు ప్రశ్నాపత్రాన్ని చదవలేక పోవడంతో పూర్తి కంటి చూపుని కోల్పోయిన విషయం తనని బాధించింది. ఇక ఎప్పటికీ చదువుకోలేడనే బాధ భవిష్యత్తు గురించి ఆలోచనలు అతన్ని మరింతగా వేధించాయి. ఇంటి వరండాలో కూర్చొని కన్నీటి పర్యంతమైన రాజ్‌దీప్‌తో 'కళ్లలో దాచుకున్న ఆశయాలు కన్నీళ్ల రూపంలో జారిపోతాయని, వాటిని హృదయంలో పదిల పరుచుకుంటే గుండె చప్పుడు రూపంలో అవి మన ఆశయాన్ని గుర్తుచేస్తూ వాటిని చేరుకునేలా చేస్తాయని' తండ్రి చెప్పిన ఆ మాటలు ఆ చిన్నారిలో పట్టుదలని పెంచాయి. తిరిగి చదువుని కొనసాగించాలనుకున్నా అప్పుడే ఊహించని సంఘటన చోటు చేసుకుంది. తండ్రి మరణించడంతో చదువు పక్కన పెట్టి కుటుంబ పోషణ కోసం ఒక కంపెనీలో ఆపరేటర్‌గా చేరాడు. అయితే అంధుల కోసం ఓ ఎన్‌జివో సంస్థ పాఠ్యపుస్తకాల్లోని అంశాలని ఆడియోలుగా మార్చి అందిస్తున్న విషయాన్ని తెలుసుకుని ఆ క్యాసెట్లని తన వాక్‌మెన్ ద్వారా వినేవాడు. మైసూర్ యూనివర్శిటీలో కరెస్పాండెన్స్‌లో ఎం.కామ్.ని పూర్తిచేసి గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచాడు. తర్వాత ఎమ్‌బిఎ, ఎమ్‌ఫిల్‌తో పాటు కామర్స్‌లో డాక్టరేట్‌ని పూర్తిచేశాడు రాజ్‌దీప్. ఉపాధ్యాయుడిగా పనిచేయాలనుకున్న తన కల నెరవేర్చుకునేందుకు వివిధ కళాశాలల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. 16 కళాశాలల ఇంటర్వ్యూల్లో వైఫల్యం తర్వాత జైన్ యూనివర్సిటీలో పనిచేసే అవకాశం లభించింది. అయితే తక్కువ కంఠ స్వరం కారణంగా తన బోధనా విధానం విద్యార్థులని ఆకట్టుకోలేకపోయింది. తొలి నాళ్లలో ఇలాంటి అంశాలు తనని పూర్తిగా బాధించేవి. వాటిని అధిగమించేందుకు జాక్ కెన్‌ఫీల్ ప్రసంగాలని వినడంతోపాటు కళాశాల లైబ్రరీలోని ప్రముఖ వ్యక్తుల ప్రసంగాలని వినేందుకు లైబ్రేరియన్ సాయం తీసుకున్నాడు. ఒక డ్రామా ఆర్టిస్ట్ సహకారంతో తన స్వరం మెరుగయ్యేందుకు సాధన చేశాడు. ప్రతిరోజు ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఇలా రెండేళ్ల సాధనతో విద్యార్థులని ఆకట్టుకునే విధంగా బోధిస్తూ అందరి మన్ననలను అందుకోగలిగాడు. అప్పటి నుంచి మంచి ఉపాధ్యాయుడిగా విద్యార్థులకి చక్కటి మార్గనిర్దేశాన్ని చేస్తూ వారికి ప్రేరణనిచ్చేలా ప్రసంగించడం ప్రారంభించాడు. వేలాదిగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణతోపాటు వికలాంగులు జీవితాశయాన్ని అందుకునేలా వారిని చైతన్యపరిచేందుకు తన భార్యతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించాడు. సమకాలీన విషయాలతో పాటు అనేక అంశాల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన వారికి సభ్యత్వాన్ని ఇచ్చే అంతర్జాతీయ సంస్థ టోస్ట్‌మాస్టర్స్ ద్వారా టోస్ట్ 'మాస్టర్' అవార్డుని అందుకున్నాడు. అంగవైకల్యం ఉన్నవారితోపాటు మామూలు వ్యక్తులకి ఒక రోల్‌మోడల్‌గా నిలిచి వికలాంగుల సాధికారత కోసం తను చేస్తున్న కృషికిగాను రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ స్థాయి అవార్డుని అందుకున్నాడు. ఉపాధ్యాయుడిగా, వక్తగా, వ్యక్తిత్వ వికాస శిక్షకునిగా, క్విజ్ మాస్టర్‌గా వివిధ బాధ్యతల్ని నిర్వర్తిస్తూ బహుముఖప్రజ్ఞాశాలి అనిపించుకున్నాడు. క్విజ్ పోటీల్లో సాధారణంగా ఒక కార్డ్‌పై రాసున్న ప్రశ్నలని క్విజ్ మాస్టర్స్ అడుగుతారు. రాజ్‌దీప్ మాత్రం వీరికి భిన్నంగా తను అడగాల్సిన ప్రశ్నలన్నిటినీ మైండ్‌లోనే సేవ్ చేసుకుంటాడు. దీన్ని బట్టే అతని జ్ఞాపక శక్తి ఎలాంటిదో అంచనా వేయొచ్చు.



\- శర్వాణి

ఇండెక్స్

సేవ.................3
ఒంటెల అమ్మ

స్టార్........4
అరవిరిసిన అరవిందం

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం..........10
హస్కీ విందు

విశేషం............... 11
తేనెలూరే చిత్ర కళ

కవిత్వమ్...............14
రూపాయి పోరాటం

ఎన్ని క్రిస్ట్‌మస్‌లో..!

అట్టమీది కథ...6

వివరం- 12
చుక్కల సెలయేళ్లు

విజేత...................15
వీల్ చెయిర్‌ను పర్వతమెక్కించి...

కథ 16
ఎద సవ్వడి

రుచి...................21
రెడ్ వెల్వెట్ కేక్

బాల నేస్తాలు............23
మాలి మ్యాజిక్ సిస్టర్స్

పద వికాసం.....
....24

ఆకట్టుకున్న మనీ మనీ

11-12-2016 అట్టమీది కథ 'మనీ మనీ' పుట్టుపూర్వోత్తరాలు, పరిణామ క్రమాన్ని విశ్లేషించిన తీరు శ్లాఘనీయం. దాసరి శివకుమారి గారి 'గాలం కథ బావుంది. మేఘంతాకే సరస్సులు సచి త్ర సహితంగా అలరింపజేసాయి. నేల నుంచి నిం గి దాకా, నడిచే మెమొరీ, తేనీటి రంగూ రుచి ఆక ట్టుకున్నాయి. డా.కోర్డియా వంటి అంకిత భావం గల వ్యక్తులు ఈ సమాజానికి చాలా అవసరం.

- నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

మేఘం తాకే సరస్సులు

స్నేహ కవర్ చివరి పేజీపై వచ్చిన అద్భుతమైన సరస్సుల చిత్రాలు, లేటెస్ట్ ఆర్ట్ డిజైన్స్‌పై వేసిన కలరింగ్స్ నుంచి చూపు మరల్చుకోలేకపోయాం. వివిధ దేశాల్లో అందంగా దొలిచినట్లున్న పర్వత శ్రేణులు, సహజ సిద్ధమైన కొలనుల చిత్రాలని అందించినందుకు సంతోషం. 17000 అడుగుల ఎత్తులో వున్న కొండల్లో, అతి క్లిష్టమైన శీతల వాతావరణంలో బడుల్లో చదువుకుంటున్న చిన్నారులకు పుస్తకాలు, ఆటవస్తువులు నిత్యం చేరవేస్తున్న సుజాతా సాహు

సేవాదృక్పథం మెచ్చుకోదగినది.

-టి.సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

నేల నుంచి నింగి దాకా...

విద్యార్థులకోసం సుజాతా సాహు సాహసం మెచ్చుకోతగినదే. వెయిట్‌లిఫ్టర్ గ్రామం దేశానికే గర్వకారణం. ఇటువంటి గ్రామాలని ప్రభుత్వం ప్రోత్సహించాలి. మనుషులకి మారకపు విలువకు వెలకట్టే మనీ మనీ గురించి ఎంత చెప్పుకున్నా అది తక్కువే. రూపం ఏదైనా మనీ విలువకలిగిందే. మనీ లేని సమాజాన్ని సృష్టించడం ఇప్పట్లో సాధ్య పడదు. సమ సమాజ స్థాపనలో జరగవచ్చే. నడిచే మెమొరీ బాగుంది. వింతలు విషేషాలు అంటే ఇవేనేమో. డొమినిక్ ఆలోచనా తీరుకి హ్యాట్స్ ఆఫ్. ఉదయాన్నే ఒక కప్పుటీ పడితే గానీ మనసుకి హాయి కలగదు. అలాంటి తేనీటి రంగు రుచి, ప్రత్యేకతలని చక్కగా వివరించారు. దుర్వెసనాల గాలంలో చిక్కుకుంటే బైటపడడం కష్టమనే చక్కని సందేశాన్ని అందించిన గాలం కథ ఆకట్టుకుంది. అడవులని నాశనం చేస్తున్న నేటి రోజుల్లో అటవీ ప్రాంతానికి వెళ్లి అక్కడి ప్రజలకు వ్యవసాయంపై శిక్షణ ఇస్తూ అడవినే మార్చేసిన ప్రవీణ్ కోర్డియా కు అభినందనలు. ప్రకృతి అందా లు వర్ణనాతీతం. మేఘం తాకే సరస్సులు, పెద్దోళ్ల కలరింగ్ డిజైన్‌లు బాగున్నాయి.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆమదాలవలస

కండ కలవాడే...

తమిళనాడులోని వెయిట్ లిఫ్టర్ గ్రామంపై అందించిన కథనం బాగుంది. 'కండ కలవాడేను మనిషోయ్' అని ఓ కవి చెప్పిన మాటలని ఆ గ్రామస్థులు నిజం చేస్తున్నారు. కవర్ స్టోరీ మనీ మనీ ఆసక్తికరంగా ఉంది. రాజుల కాలం నుంచి వచ్చిన నాణేల గురించి చక్కగా వివరించడంతోపాటు అప్పటి నోట్లు, నాణేల ఫోటోలనూ బాగా ప్రచురించారు. అడవినే మార్చేసిన డా. ప్రవీణ్ కోర్డియా అభినందనీయుడు

వద్ది దుర్గారావు, ఎల్ఎన్‌డి పేట

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

రాజస్థాన్ అనగానే మొదటగా గుర్తుకొచ్చేది ఒంటెలు. వీటిని ఎడారి ప్రాంతానికి ఐకాన్‌గా పిలుస్తారు. ఒకప్పుడు రాజస్థాన్ ఆర్థికాభివృద్ధిలో, సరుకు రవాణాలో కీలకపాత్ర పోషించిన ఒంటెల జాతి నేడు అంతరించిపోతోంది. వాటిని పోషించే రైకా తెగవారి పరిస్థితీ ఘోరంగా మారింది. పిహెచ్‌డీ కోసం రాజస్థాన్ వెళ్లిన జర్మనీకి చెందిన కొహ్లర్ దృష్టి వీరిపై పడింది. ఒంటెల జాతిని సంరక్షించాలనే సంకల్పంతో తన జీవితాన్నే అంకితం చేసింది. ఆమె విజయం ఏ స్థాయికి చేరిందంటే రాజస్థాన్ ప్రభుత్వాన్నే కదిలించింది.

ఒంటెల అమ్మ

జర్మనీకి చెందిన పశువైద్యురాలు కొహ్లర్ రోలెఫ్సన్ పిహెచ్‌డీ కోసం 1990లో రాజస్థాన్ వెళ్లింది. అక్కడి ఒంటెల వాస్తవ పరిస్థితిని చూసి నిర్ఘాంతపోయింది. రాష్ట్రానికే గర్వకారణమైన ఒంటెలు... తినటానికి తిండి లేక, ఒళ్లంతా వ్యాధులతో బిక్క చూపులు చూస్తున్నాయి. మరోపక్క పశుపోషకులైన రైకాలు ఒకప్పుడు లక్షల సంఖ్యలో ఉంటే నేడు వేలకు పడిపోయారు. బతుకే భారమై వలసబాట పడుతున్నారు. మేత భూములు కనుమరుగయ్యాయి. ఒకప్పుడు ఒంటెలతో చేసే వ్యవసాయం నేడు యాంత్రిక వ్యవసాయంగా మారడంతో ఒంటెలకు డిమాండ్ లేక రైకాలు ఇబ్బందిపడుతున్నారు. ఇదంతా కళ్లారా చూసిన కొహ్లర్ ఒంటెలకు పూర్వవైభవం తేవాలని, రైకాల జీవితం మెరుగుపర్చాలనే ధ్యేయంతో అక్కడే స్థిరపడాలని నిర్ణయించుకుంది.

ప్రపంచంలో ఒంటెలను పెంచేది కేవలం రైకా జాతివారే. ఒంటె ప్రవర్తన, సంతానోత్పత్తి, ఆరోగ్య సంరక్షణ గురించి వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఒంటెలతో వారి అనుబంధంపై ఓ జానపద కథ కూడా ఉంది. వీరు ఒంటెలతో సంభాషించడానికి అకల్-దకల్ భాషను ఏర్పాటు చేసుకున్నారు. కానీ ఒకప్పుడు వందలాది ఒంటెలను పెంచిన వారు ప్రస్తుతం కొన్నింటిని కూడా పోషించే స్థితిలో లేరు. కొహ్లర్ తన స్నేహితుడు హనువత్ సింగ్‌తో కలిసి 1996లో పాలిలో ఎన్జివోగా పిలవబడే లోహిత్ పశుపాలక్ సంస్థాన్‌ను(ఎల్‌పిపియస్), రైకాస్, ఒంటెల సమస్యల పరిష్కారం కోసం న్యాయవాద గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. అక్కడి ఒంటెలతో, రైకా కుటుంబాలతో మంచి అనుబంధాన్ని ఏర్పరచుకుంది. ఒంటెల మరణాలని నివారించడానికి మందులను సరఫరా చేసింది. వృత్తిరీత్యా తను పశువైద్యురాలైనందున తను వైద్యం చేస్తూ రైకాలకు కూడా నేర్పించింది. వాటి బాగోగులకు కొంత నిధులను పోగుచేసింది. సంస్థ ద్వారా ఒంటె యాత్రలను, స్థానిక సంఘాల మధ్య అవగాహనా సమావేశాలు ఏర్పాటు చేసింది. సాద్రీలో మార్వార్ ఒంటె సాంస్కృతిక వేడుకలను మూడు రోజులు నిర్వహించి ఒంటె పాలు, ఒంటె ఉన్ని ఉత్పత్తుల ఉపయోగాలను తెలిపింది. పెంపకందారుల మధ్య ఎవరి ఒంటె ఎక్కువ పాలిస్తుందనే ప్రోత్సాహక పోటీని ఏర్పాటు చేసింది. ఆమె 'క్యామిల్ కర్మా' అనే పుస్తకాన్ని రాసింది. అందులో తన ఆలోచనలు, ప్రయోగాలు అక్కడ పరిస్థితులను ఎలా మార్చగలిగాయో వివరించింది.

2010లో జైసల్మేర్ సమీపంలోనున్న మైక్రో డైరీకి చరిష్మా ఒంటె పాలను వారానికి 150 లీటర్లు అందించాలనే ధ్యేయం పెట్టుకున్న ఆమె రోజుకు 300 లీటర్ల పాల ఉత్పత్తిని పెంచే స్థాయికి అభివృద్ధి చేసింది. పచ్చిపాలను ఫ్రిజ్‌లలో భద్రపరచి ఇతర ప్రాంతాలకూ సరఫరా చేసింది. అక్కడి చెట్ల ఆకులు, బెరడులో వైద్యపరమైన లక్షణాలున్నట్లు గుర్తించింది. ఒంటె పాలను సేవిస్తే ఆరోగ్యపరంగా మంచిది. షుగర్ వ్యాధిగ్రస్తులకు అద్భుత ఔషధంలా పనిచేస్తాయి. టైప్2 మధుమేహ వ్యాధిగ్రస్తులకు షుగర్ స్థాయిని బాగా తగ్గిస్తున్నాయని శాస్త్రీయంగా నిరూపించారు. బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకు(ఆటిజం) ఈ పాలు తాపితే హాయిగా నిద్రపోతారు. ఒంటె పాలతో సెంటెడ్ సబ్బులు, జున్ను, వెంట్రుకలతో దుప్పట్లను, ఒంటె మలంతో పేపరును తయారు చేసే కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసింది. 'క్యామిల్ కేఫ్' అనే బ్రాండ్‌ను ఏర్పరచింది. ఇక్కడికొచ్చే పర్యాటకులు క్యామిల్‌కినో, క్యామిల్ ఛాయ్‌ను తాగుతుంటారు. 2004లో సుప్రీంకోర్టు కుంభాల అభయారణ్యానికి ఒంటెలను మేత కోసం తీసుకెళ్లకూడదని, ధిక్కరించి తీసుకెళ్తే పరిహారం లేదా అరెస్టు చేయమనే ఆర్డరు వచ్చింది. రైకాలకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పుపై ఎల్‌పిపియస్ వీరి హక్కుల పునరుద్ధరణకు తీవ్రంగా శ్రమించింది. దీనిపై సైంటిస్ట్ అనిల్ కె.చంగానీ అమెరికా పరిశోధకునితో కలిసి 3 సంవత్సరాలు ఎన్నో

అధ్యయనాలు చేసి ఒంటెల వల్ల ఆ ప్రదేశానికి ఎటువంటి హానీ ఉండదని, అవి సంచరించినందున భూమి సారవంతమైతుందని తెలిపారు. బీడు భూములను పునరుద్ధరించి మేతకు ఇబ్బంది లేకుండా చేయడంలో ఎల్‌పిపియస్ విజయం సాధించింది. రాజస్థాన్ ప్రభుత్వ అధికారులు కొహ్లర్ దగ్గరే సలహాలు తీసుకొనే స్థాయికి ఎదిగింది. ఆమె 'అవర్ లేడీ ఆఫ్ ది క్యామిల్' గా గుర్తించబడింది.

- కుమారి

పేరుకు తగ్గట్టే ఉంటాడు అరవింద్. 'రోజా' చిత్రంతో అరవిరిసిన ఆయన కెరీర్ 'ధృవ'తో స్థిరపడుతుందేమో. హృదయాన్ని తడిమే 'బొంబాయి' చిత్రంలోని కథానాయకుడి పాత్రని ఇంకా అభిమానులు మరిచిపోలేదు. అరవింద్‌ను అస్సలు ఎలా చూడ లేమనుకున్నారో అలా విలన్‌గా ఇప్పుడు నటనను పండించాడు. ఆ విలనీ కూడా చాలా కూల్.. సీన్ సీన్‌కి చిరాకు పెట్టించే సిగరెట్, మందు లేని ప్రతి నాయకుడిని పరిచయం చేశాడు. ఈ వారం స్టార్‌ముచ్చటలో అరవింద్ గురించి మీ కోసం...

అరవిరిసిన అరవిందం

❑ అరవింద్ స్వామి1967లో చెన్నైలో జన్మించాడు. పారిశ్రామికవేత్త వి.డి.స్వామి, భరతనాట్య కళాకారిణి వసంత స్వామిల పెంపుడు కొడుకు అరవింద్.

❑ కన్న తల్లిదండ్రుల కన్నా మిన్నగా చూసుకున్న వీరిరువుర్నీ 1993లో అరవింద్ కోల్పోయాడు. అతని అసలు తండ్రి డిల్లీ కుమార్.

❑ అరవింద్ స్వామిని అరవింద్ అరుణ్ స్వామి అని కూడా పిలుస్తారు.

❑ చెన్నైలోని శిష్య స్కూలు, డాన్ బాస్కో మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్లో చదివాడు.

❑ 1990లో చెన్నై లయోలా కాలేజీలో బికాం డిగ్రీ పూర్తి చేశాడు. తరువాత అమెరికాలోని నార్త్ కరోలినాలోని వేక్ ఫారెస్ట్ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ బిజినెస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాడు.

❑ తన తల్లి అనారోగ్య కారణంగా అమెరికా నుంచి తిరిగి వచ్చినందున పై చదువులు చదవలేకపోయాడు.

❑ చిన్ననాటి నుంచి డాక్టర్ కావాలని కోరిక ఉండేది. కాలేజీ రోజుల్లో పాకెట్ మనీ కోసం ప్రకటనల్లో నటించేవాడు.

❑ లయోలా థియేటర్ సొసైటీలో స్టేజి నుంచి కిందకు పో అని గెంటి వేయబడిన రోజులు కూడా ఉన్నాయి.

❑ ప్రఖ్యాత దర్శకుడు మణిరత్నం అరవింద్‌ను ఒక ప్రకటనలో చూసి ఒకసారి కలవమని కబురు పంపాడు. దళపతి (1991) సినిమాలోని పాత్రకు ఎంచుకున్నాడు.

❑ తొలి చిత్రంలోనే హేమాహేమీలతో నటించడం.. ఆ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలవడం అరవింద్‌కు మంచి పునాది దొరికింది. ఆ తర్వాత ఎక్కువగా తమిళ సినిమాల్లో నటించాడు.

❑ రోజా (1992), బొంబాయి (1995) సినిమాలు కెరీర్‌లో మంచి బ్రేక్‌నిచ్చాయి. ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నాడు.

❑ అరుదుగా లభించే రాజీవ్ గాంధీ అవార్డ్ ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డును సైతం సొంతం చేసుకున్నాడు. 'రోజా' చిత్రానికి తమిళనాడు ప్రభుత్వం ఇచ్చే బెస్ట్ యాక్టర్ అవార్డు అరవింద్ స్వామికి దక్కింది.

❑ ఆ సినిమాల్లో నటించేటప్పటికీ తన వయస్సు 21 సంవత్సరాలే.

❑ సిగ్గరి కావడంతో సినిమాలు చేయగలనా అనే సందేహంతో ఉండేవాడట.

❑ అరవింద్ 'నీన్‌గళం వీల్లలాం ఓరు కోడి' అనే తమిళ టీవీ షోలలో వ్యాఖ్యాతగా చేసి స్టేజ్ ఫియర్‌ను పోగొట్టేసుకున్నాడు.

❑ గాయత్రి రామమూర్తిని 1994లో వివాహం చేసుకున్నాడు అరవింద్. వీరికి అదిరా, రుద్రాస్వామి అనే ఇద్దరు పిల్లలు. 2010లో వీరిద్దరి మధ్య మనస్ఫర్ధలు వచ్చి విడిపోయారు. కూతురు, కొడుకును మాత్రం తన దగ్గరే ఉంచుకున్నాడు. 2012లో అపర్ణ ముఖర్జీ అనే న్యాయవాదిని వివాహం చేసుకున్నాడు.

❑ అరవింద్ కేవలం నటనకే పరిమితం కాకుండా కొన్నిరోజులు సినిమాలు మానేసి బిజినెస్‌పై దృష్టి పెట్టాడు.

❑ ఫైనాన్షియల్ ప్రాసెస్‌లు చేసే బ్యాక్ ఆఫీస్, వర్క్ ఫ్లో అప్లికేషన్స్ క్రియేట్ వంటి బిజినెస్ చేశాడు. అతని దగ్గర వందలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

❑ అరవింద్‌కు 2006లో యాక్సిడెంట్ అయ్యి వెన్నెముకకు దెబ్బ తగిలింది. అప్పుడే పక్షవాతం కూడా వచ్చి ఏడాదిపాటు నడవలేకపోయాడు. తను పూర్తిగా కోలుకోడానికి మూడేళ్ల సమయం పట్టింది.

❑ ఆ సమయంలో కుంగుబాటుకు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకుని రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. అరవింద్ మళ్లీ నటిస్తాడని ఎవరూ అనుకోలేదు. కానీ 'తని ఒరువన్'తో తన నటనలో టెక్స్ట్‌బుక్‌ను తెరిచాడు. కొత్త స్టైయిల్‌లో ఎంతో కూల్‌గా ఓ ప్రత్యేక శైలికి ప్రాణం పోశాడు.

❑ వచ్చే ఏడాది డైరెక్షన్ చేయాలనుకుంటున్నాడు. ప్రస్తుతం రెండు కథలు సిద్ధంగా ఉన్నాయి. అరవింద్‌కు తెలుగు రానందున తమిళ చిత్రాలకే డైరెక్షన్ చేయబోతున్నాడు. ✦

నవ్వుల్ - పువ్వుల్

పై అంతస్తు



ఇంటి ఓనర్ : మొదటి అంతస్తులో ఖాళీ ఉంటే పన్నెండో అంతస్తులో కావాలంటున్నావెందుకు?

విజయ్ : నన్నెప్పుడూ ఉన్నత స్థాయిలో చూడాలని మా నాన్నగారి కోరిక!

కొత్త లేదు



సుధ : మీరు న్యూ ఇయర్‌ని జరుపుకోరా....

రాధ : లేదండి

సుధ : ఎప్పటి నుంచి?

రాధ : మా ఆయన పురావస్తు శాఖలో పనిచేస్తున్నప్పటి నుంచి

కిసుక్కు



టీచర్ : చింటూ పరీక్ష పేపర్లలో ఇలా అన్నీ సగం సగం సమాధానాలు రాశావేంటి?

చింటు : హాఫ్ ఇయర్లీ పరీక్షలు కదా టీచర్...అందుకే

టీచర్ : ఆ.....

బి కాన్ఫిడెంట్

నర్సు : చిన్న ఆపరేషనే మీ రేమీ భయపడకండి...

రోగి : అబ్బే...నాకేం భయం లేదు

నర్సు : నేను చెబుతున్నది మీక్కాదండీ... డాక్టర్‌కి

రోగి : ఆ.......



నా కార్టూన్

వి. రామకృష్ణ, విజయవాడ

అతితెలివి

రమణ : ఇది ఆయుర్వేద టూత్ పేస్టు. ఇందులో పుదీన, ఉప్పు, లవంగాలు, పసుపు, అన్నీ ఉన్నాయి.

వెంగళప్ప : అయితే ఇటివ్వు ఈ రోజు ఇడ్లీలోకి మా ఆవిడ చట్నీ చేయలేదు!

సీటు

వెంగళప్ప : రైల్లో పై సీటులో నిద్రపట్టలేదు.

రాజు : మరి కింద సీటులో ఉన్న వాళ్లని అడక్కపోయావా....

వెంగళప్ప : అడుగుదామనే అనుకున్నా కానీ ఎవరూ లేరు

కిసుక్కు సిత్రం

అచ్చొచ్చో..!



ఎన్ని క్రిస్ట్‌మస్‌లో..!

అట్టమీది కథ

క్రిస్టమస్... క్రైస్తవులకు ఆరాధ్యుడైన యేసు క్రీస్తు జన్మదినంగా పరిగణించబడుతున్న రోజు. పేరుకు క్రైస్తవుల పర్వదినమే అయినా ప్రపంచవ్యాప్తంగా సర్వ మానవాళీ ఉత్సాహంగా పాటించే రోజు. మతాలకతీతంగా అందరూ ఆనందంగా పాల్గొనే పండగగా క్రిస్టమస్ పేరొందింది. పరస్పరం అభినందించుకోవడం, బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం, క్రైస్తవుల ఇళ్లను సందర్శించి మరీ శుభాకాంక్షలు తెలుపుకోవడం... ఒక సోదరభావం వెల్లివిరిసే పండగ క్రిస్టమస్. పైగా శీతాకాలంలో రావడం వల్ల మంచి అనుకూల వాతావరణం కూడా మంచి అనుభూతులకు ఆలవాలంగా ఉంటుంది. భౌగోళిక ప్రాంతాలు, సాంప్రదాయాలకు అనుగుణంగా చిన్న చిన్న మార్పులు అన్వయించుకుంటూ కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకే రకంగా జరుపుకునే పండగ ఇది. ఈ క్రిస్టమస్ సాంప్రదాయాల వైవిధ్యాల కలబోతే ఈ వారం అట్టమీది కథ.

డా. కాకర్లమూడి విజయ్

ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25ను క్రీస్తు జన్మదినంగా క్రిస్టమస్ పేరుతో వేడుక జరుపుకోవడం మనకి తెలుసు. క్రీస్తు జననానికి సంబంధించిన ఘట్టాలను ఆవిష్కరిస్తూ బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం, కథలు వినడం పిల్లలకే కాదు పెద్దలకు కూడా ఓ మెర్రీ టైమే. మతపరమైన విశిష్టత కాసేపు పక్కన పెడితే క్రిస్టమస్ అంటే ఇవ్వడం, కుటుంబ, బంధు, మిత్రుల కలయిక, అందమైన అలంకరణలు, ఆహ్లాదమైన సంగీతం, ఆనందమైన ఆహారం. ఈ క్రమంలో ఇంటి ముందు కాంతులీనే నక్షత్రం, ఇంటి లోపల అలంకరించిన క్రిస్టమస్ చెట్టు, ఘుమఘుమలాడే క్రిస్టమస్ కేక్ మామూలే. ఈ మధ్యలో 'శాంటా క్లాస్' అనే ఒకే క్రిస్టమస్ తాత. దుప్పులు పూనిన మంచు రథం ఎక్కి ఆకాశ మార్గాన ప్రయాణిస్తూ, ఇళ్ళ పొగ గొట్టాల గుండా లోపలి జారి, అక్కడి క్రిస్టమస్ చెట్టుకి వేలాడ దీసిన సాక్స్ (మేజోళ్ళ)లో కోరుకున్న బహుమతులు పెట్టి వెళ్లి పోతాడని ఒకప్పటి నమ్మకం. ఎరుపు దుస్తులు వేసుకుని తెల్ల గడ్డం పెట్టుకున్న శాంటా క్లాస్‌లు ఇప్పుడు షాపింగ్ మాల్స్ దగ్గర కూర్చుని పిల్లలకు చాక్లెట్‌లు అవీ ఇస్తూ సంతోష పరుస్తుంటారు. ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ చాలా చోట్ల దర్శనం ఇస్తున్నారు.

ఈ పండగలో భాగంగా ఒక రెండు వారాల ముందు నుండే బృందాలుగా ఇంటింటికీ వెళ్లి పాటలు (కేరల్స్) పాడటం కూడా ఒక సందడే. విశేషమేమంటే, ఈ పండగకు 'మా ఇంటికి రండి' అని పిలవక్కరలేదు. క్రైస్తవులు తమ మిత్రుల ఇళ్ళకు వెళ్లి, కేక్ ఇచ్చి, వారు ఇచ్చిన కేక్ తిని, బహుమతులు ఇచ్చి పుచ్చుకుని, శభాకాంక్షలు తెలిపి రావడం ఒక అందమైన మైత్రీ బంధ వ్యక్తీకరణ. అందరినీ ప్రేమించడం, అందరితోనూ ఆనందంగా ఉండటం వేడుకల్లో కనిపిస్తుంది.

అమెరికాలో అయితే నవంబర్ మూడవ గురువారం ప్రాంతంలో వచ్చే కృతజ్ఞతా దినం (థ్యాంక్స్ గివింగ్ డే)

తరువాత మొదలయ్యే క్రిస్మమస్ వేడుకలు అట్టహాసంగా కొత్త సంవత్సరం వరకూ కొనసాగుతాయి.

సుద్దులు నేర్పి...

ఫ్రాన్స్‌లో క్రిస్టమస్ వేడుకలు సెయింట్ నికోలస్ దినంగా భావించే డిసెంబర్ 6 నుంచి ప్రారంభమౌతాయి. మొత్తం నగరాలన్నీ శోభాయమానంగా దీపాలతో అలంకరిస్తారు. పిల్లలకు స్వీట్లు, బహుమతులు అందిస్తారు. పిల్లలు తమ బూట్లను పాలిష్ చేసి మరీ తమ ఇంట్లోని చిమ్నీల దగ్గర ఉంచుతారు. ఇలాగైనా శుచీ శుభ్రత పిల్లలకు ముందు నుంచే అలవడతాయనేమో. పిల్లల సరదా మాత్రం వేరు. క్రిస్టమస్ తాత వాటి నిండా స్వీట్లు నింపుతాడని వారి నమ్మకం. క్రిస్టమస్ రోజు కుటుంబాలన్నీ ఒకచోట చేరి విందు చేసుకుంటాయి, బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటాయి.

తప్పుకు బొగ్గు ముక్క

ఇటలీలో శాంటా క్లాస్ బదులు 'లా బెఫానా' అనే మంచి మంత్రగత్తె పిల్లలకి బహుమతులు పంచిపెడుతుందని నమ్మకం. ఆమె పొడవాటి చీపురు కర్రపై వస్తుందని చెడ్డ పనులు చేసిన పిల్లలకు బొగ్గు మాత్రమే ఇస్తుందని నమ్మకం. చిన్నారుల్ని గాడిలో పెట్టేందుకు ఇదో మంచి సందర్భం కావడం మంచిదే కదా. మరో మాట.. ఈ సంబర మంతా ఇటలీలో జనవరి 6వ తేదీన జరుగుతుంది.

ఇచ్చిపుచ్చుకుంటేనే బావుంటుంది

నెదర్లాండ్స్‌లో శాంటా క్లాస్‌ని సిన్టర్ క్లాస్ అంటారు. ఆతను వారికి ఎక్కడో ఉత్తర ధృవంపై కాక స్పెయిన్‌లో నివసిస్తాడని, అక్కడి నుంచి మర పడవలో, బ్లాక్ పీటర్ అనే సహాయకుడిని తీసుకుని వస్తాడని ప్రజలు భావిస్తారు. వారి సంస్కృతిలోని కొన్ని లోపాలు, చారిత్రకంగా అందివచ్చిన భావజాలాల వల్ల బ్లాక్ పీటర్ బానిసపాత్ర వచ్చినా ప్రస్తుతం మాత్రం క్రిస్టమస్ వేడుకల్లో అంతా సంతోషమే కనిపిస్తోంది. తమకు గిఫ్టులిచ్చే పాత్రల పుట్టు పూర్వోత్తరాల కన్నా కూడా ఇచ్చిపుచ్చుకోవడంలోని ఆనందాన్నే ఎక్కువ వెతుక్కుంటున్నారు.

ప్రత్యేక పానీయంతో...

జర్మనీలో కూడా క్రిస్టమస్ వేడుకలు అట్టహాసంగా జరుగుతాయి. ఎక్కడ బడితే అక్కడ ప్రత్యేకంగా దుకాణాలు తెరుస్తారు. వాటిలో క్రిస్టమస్‌కి సంబంధించిన వస్తువులు అమ్ముతారు. ఈ సీజన్‌లో ప్రత్యేకంగా గ్లూవైన్ అనే పానీయం అందుబాటులోకి తెస్తారు. దట్టంగా మంచు పట్టి వున్న సమయంలో ఈ పానీయం తాగి సంబరం చేసుకుంటారు. ఈ పానీయం కేవలం క్రిస్టమస్ రోజుల్లో మాత్రమే తయారు చేస్తారు.

రోజు కాదు నెలంతా...

లండన్‌లో క్రిస్టమస్‌కి ఒక నెల రోజుల ముందే వేడుకలు మొదలవుతాయి, జనవరి మొదటి తారీకు వరకూ కొనసాగుతాయి. ఆ రోజులలో నగరమంతా విద్యుద్దీపాలతో వెలిగిపోతుంది. త్వరగా చీకటి పడటంతో వేడుకలు తెల్లవారు ఝాము వరకూ జరుగుతాయి. దాదాపు ప్రతి కూడలిలోనూ క్రిస్టమస్ చెట్లు ఆకర్షణీయంగా అలంకరించబడి అలరారుతుంటాయి.

మన దేశంలో ఎన్నో..!

భారత దేశంలోను తాహతు మేరకు క్రిస్టమస్ వేడుకలు జరుపుకుంటారు. ఈశాన్య రాష్ట్రాలలో క్రైస్తవులు అధికం. అందుకే అక్కడ ఈ పండగ హడావుడి ఎక్కువ. చర్చిలకు, ఇళ్లకు కొత్తగా రంగులు వేసి, దీపాలతో అలంకరించడం ఇక్కడి అలవాటు. చర్చిలలో పండగకు కొద్ది రోజుల ముందు నుండే 'అడ్వెంట్ సీజన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్రిస్టమస్‌కి సరిగ్గా ఒక నెల ముందు 'సపోర్ట్ క్రిస్టమస్' లేదా 'సెమీ క్రిస్ట మస్' పేరుతో ముందస్తు వేడుకలు జరుపుతారు. క్రీస్తు జననం ఇతివృత్తంగా నాటికలు, పాటలతో కోలాహలం ఉంటుంది. ఆ తరువాత చర్చి సభ్యులు బందాలుగా విడిపోయి ఒక్కో ప్రాంతంలోని కుటుం బాల ఇళ్లకు వెళ్లి క్రిస్టమస్ పాటలు (కారల్స్) పాడతారు.

కొన్ని చర్చిలలో క్రిస్టమస్ ఈవ్ (క్రిస్టమస్ ముందు రోజు సాయంత్రం) ప్రత్యేక వేడుకలు వుంటాయి. కొన్ని చోట్ల రాత్రి ప్రార్థనలు వుంటాయి. యధావిధిగా క్రిస్టమస్ రోజు ప్రార్థనలూ వుంటాయి. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం సందడిగా వుంటుంది. క్రైస్తవేతరులు తమ క్రైస్తవ స్నేహితుల



ఇళ్ళకు వెళ్లి మరీ వారిని అభినందించడం విశేషం.

ఇతర పండగల లాగే కొత్త బట్టలు వగైరా మామూలే. చాలా మంది ఇళ్ళకు స్టార్ లైట్లను అలంకరిస్తారు. ఇంటి లోపల క్రిస్టమస్ చెట్టు కూడా అలంకరిస్తారు. ఇప్పుడు చాలా వరకూ కృత్రిమ క్రిస్టమస్ చెట్లను అలంకరించుకుంటారు. గానీ, కొన్ని ప్రదేశాలలో స్థానికంగా లభించే అరటి, మామిడి చెట్లను అలంకరిస్తారు. కొందరు మామిడి ఆకుల తోరణాలు కూడా కడతారు. కొందరు విద్యుత్ దీపాలు పెడితే కొంతమంది దీపావళిలాగా ప్రమిదలతో అలంకరించుకుంటారు. సాధారణంగా క్రిస్టమస్ చెట్టు, ఇంటి ముందు క్రిస్టమస్ నక్షత్రం వంటి అలంకరణలు మరో వారం వరకూ, అంటే కొత్త సంవత్సరం ఆరంభం వరకూ ఉంచుతారు.

దేవాలయాలకి వెళ్ళడం, కొత్త దుస్తులు ధరించడం చుట్టపక్కాలు వచ్చి శుభాకాంక్షలు తెలపడం, కేక్, ఇతర పిండి వంటలు ఇరుగు పొరుగు వారికి పంచడం వంటి సంబరాలతో క్రిస్టమస్ రోజు కోలాహలంగా వుంటుంది. పండగ రోజుకి నెల ముందు నుండే కొన్ని బందాలు ఇంటిం టికీ రాత్రి వేళల్లో వెళ్లి క్రిస్టమస్ గీతాలను పాడటం (కారల్స్), ఆ ఇంటి వారు వాళ్లని సాదరంగా ఆహ్వానించి ఆదరించడం ఒక వేడుక. ఇక అన్ని పండగల లాగే, క్రిస్టమస్ పండగ రోజు రాత్రి స్నేహితులతో, చుట్టాలతో విందు భోజనం సాధా రణంగా జరిగేదే. మొత్తానికి ఒక నెల పాటు క్రైస్తవు లకూ, క్రైస్తవేతరులకూ కూడా క్రిస్టమస్ సందడి వుంటుంది.

క్రిస్టమస్ చెట్టు

క్రీస్తు జన్మించక ముందు నుండే పచ్చని మొక్కలు ప్రజల జీవనంలో భాగంగా ఉండేవి. క్రిస్మస్ సమయంలో క్రిస్టమస్ చెట్టుని అందంగా అలంకరించి ఉంచడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పుడైతే అనేక రకాల కృత్రిమ క్రిస్టమస్ చెట్లు అందుబాటులో వున్నాయి గానీ, తౌలుత, నిత్యం పచ్చగా వుండే పైన్ చెట్లను మాత్రమే అలంకరించే వాళ్ళు. యూరప్, ప్రాచీన ఐగుప్తులు, చైనీయులు, హెబ్రీయులు పచ్చని చెట్లను అలంకరించి, వాటిని పూజించే వాళ్ళు. దుష్ట శక్తులను నిరోధించే శక్తి పచ్చని చెట్లకు వుందని వాళ్ళు విశ్వసించే వాళ్ళు. వాళ్ళు క్రైస్తవులుగా మారిన తరువాత కూడా క్రిస్టమస్ పండగ సంబరాలలో అదే అలవాటుని

కొనసాగించారు.

అసలు క్రిస్టమస్ చెట్టు ఇంట్లో పెట్టుకోవడం అనేది జర్మన్‌ల నుండి పుట్టింది. మధ్య యుగంలో జర్మన్‌లు డిసెంబర్ ఇరవై నాలుగవ తేదీన ఈడెన్ తోటలో ఆడం, ఈవ్‌కి గుర్తుగా ఫర్ చెట్టుకి ఆపిల్ పండ్లని కట్టేవారు. ఆ చెట్టుని వాళ్ళు పారడైస్ చెట్టుగా పిలుచుకునే వాళ్ళు. ఆ తరువాత క్రమేపీ క్రిస్టమస్ చెట్టు ఆచారం బ్రిటన్‌లోకి పాకింది. అక్కడ ఆ చెట్టుకి రకరకాల కొవ్వొత్తులు, మిఠాయిలు, ఇతర వస్తువులతో అలంకరించడం ఆరంభమయ్యింది.

అయితే అందరూ పచ్చని చెట్లనే క్రిస్టమస్ చెట్టుగా వాడరు. జార్జియాలో చిచిలాకీ అనే చెట్టుని రూపొందిస్తారు. చెట్ల కొమ్మలను చెక్కి, ఆ వచ్చిన చెక్క పొట్టుతో ఒక ఫర్ చెట్టులాగా తయారు చేస్తారు. విశేషం ఏమిటంటే, జార్జియన్‌లు క్రిస్టమస్‌ను జనవరి ఏడున జరుపుకుంటారు!

క్రిస్టమస్ చెట్టు ఆచారం కెనడాలో 1781లో ప్రవేశించింది. ఆ తరువాతి శతాబ్దంలో ఆ ఆచారం అమెరికాలోకి అడుగుపెట్టింది.

సాధారణంగా ఇళ్ళలో అలంకరించుకునే క్రిస్మస్ చెట్టు ఇరవయ్యో శతాబ్దం తో పాటు ఇళ్ళ బయటకు ప్రవేశించాయి. అమెరికా లో అనేక బహిరంగ ప్రదేశాలలో, కూడళ్ళ లో భారీ క్రిస్మస్ చెట్లను అమర్చడం మొదలు పెట్టారు. 1923 నుండి అమెరికా శ్వేత భవనం దక్షిణ పచ్చిక లో వారి జాతీయ క్రిస్మస్ చెట్టు అమర్చడం ఆరంభమయ్యింది. ప్రతి ఏడాది, ఆ చెట్టుకున్న దీపాలను వెలిగించడం ద్వారా అమెరికాలో క్రిస్టమస్ వేడుకలు ఆరంభమౌతాయి.

ఒకప్పుడు క్రిస్మస్ చెట్టు పూర్తిగా అడవుల నుండే సేకరించే వారు. ఇప్పుడు క్రిస్మస్ కోసం ఏకంగా లక్షల ఎకరాలలో ఫర్, పైన్ చెట్లను అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, యుకే లలో సాగుచేస్తున్నారు. ప్రతి ఏడూ అమెరికాలో 330నుండి 360 లక్షల క్రిస్మస్ చెట్లు ఉత్పత్తి అవుతున్నాయి. యూరప్ లో అంతకు రెట్టింపు ఉత్పత్తి జరుగుతోంది. దాదపు పాతిక రకాల ఫర్, పైన్ చెట్ల జాతులను డిసెంబర్ కొరకు సాగు చేస్తారు. విత్తనం నుండి సుమారు ఏడు అడుగుల ఎత్తు పెరగ డానికి ఒక్కో చెట్టు ఎనిమిది నుండి పుష్కరం (పన్నెండు ఏళ్ళు) సమయం తీసుకుంటుంది!

కృత్రిమ క్రిస్మస్ చెట్లు ఇప్పుడైతే ఎక్కువగా చైనా నుండి దిగుమతి అవుతున్నా, ముందుగా రూపొందింది మాత్రం క్రిస్మస్ చెట్టు ఆచారం మొదలైన జర్మనీలోనే. అడవుల నరికివేతకు అడ్డు చెప్పే క్రమంలో, పందొమ్మిదో శతాబ్దంలో, జర్మనీలో ఈకలకి పచ్చ రంగు వేసి చెట్లలా చేసేవాళ్ళు. ప్రస్తుతం PVC తో, ఇంకా ఇతర పదార్ధాలతో తయారు చేస్తున్నారు. తొలి క్రిస్మస్ చెట్టు అమ్మకాలు అమెరికాలో 1850 ప్రారంభమయ్యాయి. అమెరికాలో రాక్ ఫెల్లర్ సెంటర్‌లో క్రిస్మస్ చెట్టు పెట్టడం 1933 నుండి ఆనవాయితీగా వస్తోంది.

క్రిస్టమస్ కారల్స్

ఏ పండగైనా ఎవరి పండగైనా పాటలు తప్పనిసరి. క్రిస్మస్ అందుకు భిన్నం కాదు. ఆ సమయంలో పాటలు పాడుకోవడం క్రీస్తు పుట్టుక మునుపే ప్రారంభమయ్యింది. కొన్ని వేల ఏళ్ళ క్రితమే యూరప్‌లో శీతాకాలంలో డిసెంబర్ 22 ప్రాంతంలో రైతులందరూ గుండ్రంగా తిరుగుతూ పాడుకునేవారు. కారల్ అంటేనే నాట్యం చేస్తూ పాడుకునేది అని అర్ధం.

క్రీస్తు శకం 129లో మొట్ట మొదటి కారల్, 'ఏంజెల్ హిమ్'ని ఒక రోమన్ బిషప్ క్రిస్మస్ రోజున పాడాలని ఆదేశించాడు. 'హార్క్! ది హెరాల్డ్స్ఏంజెల్స్ సింగ్' అనే పాట1739 కంటే ముందు రాసిందని అంటారు. బాగా ప్రాచుర్యం పొందిన 'సైలెంట్ నైట్' పాటని జోసెఫ్ మోర్ అనే జర్మన్ రాసాడు, జేవియర్ గరూబర్గ్ సంగీతం కూర్చాడు. దాన్ని డిసెంబర్ 24, 1818న ఆస్ట్రియాలో మొదటిసారి ఆలపించారు. ఇప్పటికి ఆపాట 44 భాషలలో తర్జుమా చేయబడింది. ప్రస్తుతం పాడుతున్న కారల్‌లు చాలా వరకూ 1843-1883 మధ్య ప్రాంతంలో రాసినవి.

బాక్సింగ్ డే

క్రిస్టమస్ తరువాతి రోజుని 'బాక్సింగ్ డే' పిలుస్తారు. దీనినే సెంట్ స్టీఫెన్ డే అని కూడా అంటారు. ఈ స్టీఫెన్ క్రీ. శ. 34లో రాళ్ళతో కొట్టి చంపబడ్డాడు. ఆ గుర్తుగా చందాలు సేకరించిన డబ్బాలు బాక్స్‌లు పేదలకు చర్చిల దగ్గర ఇచ్చేవాళ్ళు. కొంత మంది చరిత్రకారుల ప్రకారం, క్రిస్మస్ రోజు ఇంట్లో పనిచేసి వెళ్ళిపోయే సేవకులకు యజమానులు బహుమతుల డబ్బాలు ఇచ్చేవారని, ఆ విధంగా బాక్సింగ్ డే ఉనికిలోకి వచ్చిందని అంటారు.

క్రిస్టమస్ కేక్

క్రిస్టమస్ అనగానే గుర్తుకొచ్చే మరో అంశం కేక్. అన్ని పండగలలో చేసుకునే తీపి పదార్ధం లాగే పూర్వ కాలం పారిడ్జ్ అనే పాయసం వంటి తీపి వంటకం క్రిస్మస్ సమయంలో చేసుకునే వాళ్ళు. పదహారవ శతాబ్దంలో పారిడ్జ్‌లో వాడే ఓట్ల బదులు గోధుమ పిండి, వెన్న, గుడ్లు కలిపి ప్లమ్ కేక్ తయారు చేసారు. క్రమ క్రమంగా దానిలో ఎండిన ద్రాక్ష, జీడి పప్పు, బాదం, వంటి దినుసులు జోడించడం మొదలైంది. అలా అలా క్రిస్టమస్ కేక్ ఆవిర్భవించింది.

ఇప్పుడు హొటల్‌లలో క్రిస్మస్‌కి కొన్ని నెలల ముందు నుండీ కేక్ తయారీ మొదలౌతుంది.

పిండి, ఇతర దినుసులు కలపడం అనే కార్యక్రమాన్ని కేక్ మిక్సింగ్ అనే పేరుతో జరుపుకుంటారు. ఇలా చేయడం పదిహేడవ శతాబ్దం నుండీ వస్తున్న ఆచారం. ఆ కాలంలో విరివిగా లభించే పండ్లు ఫలాలతో చేసిన కేక్ మళ్ళీ వచ్చే ఏడాది వరకూ నిలవ ఉండేదట, మరో సంవత్సరం కూడా మంచి ఫలాలను ఇస్తుందని విశ్వాసం.

ఎండిన ద్రాక్షతో పాటు, చెర్రీలు, ఖర్జూరాలు, పిస్తా, బాదం, జీడి, నిమ్మ, నారింజ తొక్కలు, పంచదార పాకం, తేనే, చివరగా విస్కీ గానీ బ్రాందీ గానీ కలిపి,

అప్పుడప్పుడూ కలుపుతూ క్రిస్మస్‌కి రెండు మూడు రోజుల ముందు వరకూ ఉంచుతారు.

ఆ తరువాత కేక్‌ని బేక్ చేయడం చేస్తారు. కొన్ని ప్రాంతాలలో తయారైన కేక్‌ని బోర్లా వేసి, కొద్ది కొద్దిగా విస్కీని ప్రతి వారం దానిపై పోస్తారు. ఇదంతా పూర్తైన తరువాత అతి రుచికరమైన క్రిస్మస్ కేక్ తయారౌతుంది.

శాంటా క్లాస్

క్రిస్మస్‌తో ముడి పడి వున్న మరో అంశం శాంటా క్లాస్. ఎరుపు,తెలుపు దుస్తులతో, పొడవాటి తెల్లని గడ్డం, తలపై యెర్ర టోపీ, భుజాన పెద్ద సంచి, అందులో అనేక బహుమతులు.....ఈ ఆహార్యంతో ఉండే శాంటా క్లాస్‌లా ఇప్పుడు మన దేశంలో కూడా క్రిస్మస్ సమయంలో చాలా మంది కనిపిస్తుం టారు. క్రిస్మస్ తాతగా ప్రసిద్ధి చెందిన శాంటా క్లాస్ రూపు రేఖలు, హావ భావాలు క్లెమెంట్ మూర్ అనే కవి 1823లో రాసిన పద్యం 'ఎ విజిట్ ఫ్రం శాంటా క్లాస్'లో వివరించాడు. "లావుగా, బొద్దుగా, ఆనందంగా వుండి", ఎగిరే అడవి దుప్పులు లాగే వాహనం పై తిరుగుతూ, ఇళ్ళ పొగ గొట్టాల గుండా దిగి, పిల్లలు వేలాడ దీసిన మేజోళ్ళలో బహుమతులు పెట్టి వెళ్ళిపోతాడు.

క్రిస్టమస్ పేరు ముందు నుండీ ఉందా?

క్రిస్టమస్ అనే మాట క్రీస్తు-మాస్ అనే ఒక ఆచారం నుండి వచ్చింది. యేసు తమ కొరకు మరణించి, పునరుద్దానుడయ్యాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. అందుకు గుర్తుగా అందరూ కలిసి ద్రాక్షా రసం, రొట్టె తీసుకుంటారు. ఆ కార్యక్రమాన్ని సమభోక్తం (కమ్యూనియన్) అనే పేరుతో నిర్వహిస్తారు. సమభోక్తం సూర్యాస్తమయం తరువాత, సూర్యోదయం ముందు తీసుకోవచ్చు. అందువల్ల దానిని అర్ధరాత్రి తీసుకునే వాళ్ళు. క్రీస్తు-మాస్ క్రమంగా క్రిస్టమస్‌గా మారింది.

క్రిస్టమస్ అనాలా, ఎక్స్ మస్ అనాలా?

1100 వ సంవత్సర ప్రాంతంలో క్రిస్టియానిటీ అనే పదాన్ని క్సియానిటీ అని పలికేవారు. ఆ పదం ఆంగ్ల అక్షరం ఎక్స్‌తో మొదలౌతుంది. గ్రీక్ భాషలో ఎక్స్ అనే అక్షరాన్ని కై అని పలుకుతారు. దాంతో గ్రీకు భాషలో క్రైస్తు పదంలో మొదటి అక్షరం ఎక్స్‌తో ఉండేది. 1551లో క్రిస్టమస్‌ని ఎక్స్ టేమాస్ అనే వారు. క్రమేపీ అదే ఎక్మస్‌గా రూపాంతరం చెందింది.

వింత సంప్రదాయాలు

స్లొవాకియాలో క్రిస్మస్ రోజున ఒక విచిత్ర సాంప్రదాయం అమలుచేస్తారు. పెళ్లి కాని వాళ్ళు (పెళ్లి కావలసిన వాళ్ళు) ఆ రోజున గుమ్మానికి వీపు పెట్టి చెప్పును విసురుతారు. ఆ చెప్పు గుమ్మం వైపు తిరిగి పడితే త్వరలో పెళ్లి జరుగుతుందని నమ్ముతారు.

పాశ్చాత్య దేశాలలో క్రిస్మస్ రోజు సాంప్రదాయంగా టర్కీ అనే పక్షిని తింటారు. కానీ జపాన్‌లో చికెన్ ఎక్కువగా తింటారు. ఆ రోజు మామూలు కంటే పది రెట్లు ఎక్కువగా ఓ బ్రాండ్ ఫ్రైడ్ చికెన్ అమ్ముడవుతుంది. అలాగే, అంతటా ప్లం కేక్ సాంప్రదాయంగా వుంటే, జపాన్‌లో స్పాంజ్ కేక్ ఎక్కువ. క్రిస్మస్ రోజు తరువాత అమ్మకం కాని కేక్‌లని ఇంక ఎవ్వరూ కొనరు, తినరు. పారవేయవలసిందే!

ఫిన్లాండ్‌లో క్రిస్మస్ ముందు రోజు సాయంత్రం (క్రిస్మస్ ఈవ్) స్మశానాలకి వెళ్ళి, వారి ఆత్మీయులను తలచుకుంటూ వారి సమాధులపై కొవ్వొత్తులు వెలిగిస్తారు. అలాగే, వంటకాలన్నీ బల్ల పైనే వుంచి, ఇంటి వారు నేలపై పడుకుంటారు. ఆ రోజు గతించిన తమ వారు వచ్చి భోజనం చేసి, పడుకుని వెళ్లేందుకు వీలుగా అలా చేస్తారు.

స్వీడన్‌లో గావ్లే పట్టణ వీధుల్లో భారీ మేక బొమ్మను నిలబెడతారు. క్రిస్మస్ ఈవ్ అర్ధరాత్రి ఆ మేకను కాల్చి వేస్తారు. ఈ సాంప్రదాయం 1966లో మొదలయింది. అయితే, విశేషమేమిటంటే, పట్టణ అధికారులు ఆ మేక బొమ్మను కాల్చాలని అనుకోరు. దుడుకు యువకులు ప్రతి సారీ దాన్ని కాల్చడం, వారిని శిక్షించడం కూడా మామూలే.

మామూలుగా అయితే క్రిస్మస్ ట్రీ కి అందమైన దీపాలు, గంటలు, బొమ్మలు వేలాడ దీస్తారు. కానీ ఉక్రెయిన్‌లో ఆ చెట్టుకు సాలె పురుగు గూళ్ళను వేలాడ దీస్తారు. స్థానిక కథ ప్రకారం...ఒక నిరుపేద కుటుంబానికి క్రిస్మస్ చెట్టుని అలంకరించే స్థోమత లేదు. ఆ చెట్టుకి అప్పటికే సాలె గూళ్ళు అల్లుకుని వున్నాయి. క్రిస్మస్ రోజు తొలి సూర్య కిరణం తగలగానే ఆ సాలె పోగులే బంగారం, వెండి పోగులుగా కనిపించి సంతోషాన్ని కలిగిస్తాయి.

ఇథియోపియాలో క్రిస్మస్‌ని జనవరి ఏడున జరుపుకుంటారు. ఇలా ఒక్కో చోట ఒక్కో విధంగా క్రిస్టమస్ సంబురాలు, విధివిధానాలుంటాయి. ప్రతి పండగ ఉద్దేశం కుటుంబాల్లో, సమాజంలో సంతోషాన్ని నింపాలి, ఇరుగు-పొరుగు మధ్య సత్సంబంధాలు నెలకొనాలి, సాటి వారిపై ప్రేమ, కరుణ పెరగాలనే. క్రిస్టమస్‌లో ఇది స్పష్టంగా తెలుస్తుంది. ✦

డిసెంబర్ 25నే ఎందుకు?

వాస్తవానికి డిసెంబర్ 25నే యేసు క్రీస్తు జన్మించాడు అనటానికి చారిత్రక ఆధారాలు లేవంటారు. ఆ మాటకొస్తే అసలు ఆ రోజునే యేసు జన్మించాడని ఎవరికీ తెలీదు. బైబిల్‌లో కూడా ఆ తేదీ ప్రస్తావన లేదు. బహుశ క్రీస్తు పుట్టుక క్రీస్తు శకం ఒకటవ సంవత్సరంలో కాక కాస్త ముందుగానే అంటే క్రీస్తు పూర్వం 2-7వ సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చని కొందరి అంచనా. మన కాలమానంలో క్రీస్తు శకం '0' సంవత్సరం లేదు, నేరుగా క్రీ. పూ. 1 నుండి క్రీ. శ.1కి వెళుతుంది.

మొట్టమొదటి క్రిస్టమస్ క్రీ.శ. 336వ సంవత్సరంలో, మొట్టమొదటి క్రైస్తవ రోమన్ చక్రవర్తి కాన్‌స్టాంటిన్ అధ్వర్యంలో జరిగింది అనడా నికి నిదర్శనాలు వున్నాయి. కొన్నేళ్ల తరు వాత, క్రీ.శ. 350లో మొదటి పోప్ జూలియస్ అప్పటి రోమ్ బిషప్‌గా ఉండేవాడు. డిసెంబర్ 25న జరుపుకోవచ్చని అధికారికంగా ప్రకటించింది ఆయనే.

అసలు క్రీస్తు పుట్టిన రెండు వందల ఏళ్ళ తరువాతే మొట్టమొదటి సారి డిసెంబర్ 25 ప్రస్తావన కనిపిస్తుంది. అదీ, అప్పటి రోమన్ల 'సాటర్నేలియా' అనే ఒక కోత పండగకు దీటుగా తొలి క్రిస్టమస్ పండుగ జరుపుకున్నారని చెబుతారు. క్రైస్తవం రోమా సామ్రాజ్యంలో అధికారిక జాతీయ మతంగా ఎదిగిన తరువాత, క్రీస్తు శకం 529 ప్రాంతంలో, జస్టినియన్ చక్రవర్తి క్రిస్టమస్‌ని సెలవు దినంగా ప్రకటించాడు అని ఒక వివరణ వుంది. మన దక్షిణ భారతంలో పంట కోతకు వచ్చిన సమయంలో పండగ చేసుకునే సాంప్రదాయం వంటిదే ప్రపంచవ్యాప్తంగా వుంది. అటువంటి ఒక సంతోషకరమైన సందర్భమే క్రిస్టమస్‌కి మూలం అంటారు కొందరు. యూదులకు హనుక్కా అనే పండుగ డిసెంబర్ ఇరవై ఐదవ తేదీన ఘనంగా జరుపుకుంటారు. క్రీస్తు కూడా యూదుడే. అందువల్ల కూడా డిసెంబర్ 25ని ఎంచుకుని ఉండవచ్చు.

అయితే ఈ సంక్లిష్ట మూలాల జోలికి పోకుండా వుంటే, క్రిస్టమస్ అనగానే ఒక ప్రపంచ వ్యాప్త వేడుక అనిపిస్తుంది.

విస్తరించిదిలా...

ఇప్పుడు ప్రతి చోటా కృత్రిమ క్రిస్టమస్ చెట్టు అలంకరించి కనిపించడం మామూలైపోయింది. ఇలా క్రిస్టమస్‌కి ఒక చెట్టుని అలంకరించడం పదహారవ శతాబ్దంలో జర్మనీలో ప్రారంభమైంది. ఫర్ చెట్టుకి యాపిల్ పండ్లు, కొవ్వొత్తులు, రంగు కాగితాలు అలంకరిచేవాళ్ళు. ఈ సాంప్రదాయాన్ని ఇంగ్లాండ్‌కి విక్టోరియా రాణి భర్త, ఆల్బర్ట్ తన స్వస్థలం జర్మనీ నుంచి తీసుకువచ్చాడు. పంతొమ్మిదవ శతాబ్దపు చివరలో ఈ చెట్టు సాంప్రదాయం అమెరికాకి చేరింది.

హస్కీ విందు



సైబీరియాకు చెందిన జాతి కుక్కలు హస్కీల్ని పెంచుకోవడం కొందరికి సరదా. చలి దేశాల్లో అయితే సరే కానీ మనలాంటి వేడి దేశాల్లో వాటిని పెంచడం మహా కష్టం. ఎంత కష్టమైనా పర్లేదు పెంచేస్తానని తెచ్చుకున్నాడు బ్యాంకాక్‌కు చెందిన పా. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా డజన్ల కొద్దీ కుక్కలను సాకేస్తున్నాడీ హస్కీ ప్రియుడు. ఇదే కాదు మరో విశేషం కూడా ఉంది. తన సొంత పొలాన్ని హస్కీ కేఫ్‌గా మార్చాడు. ట్రూ లవ్ కేఫ్‌గాను పిలిచే కేఫ్ ప్రత్యేకతేంటంటే పా అనే కాదు కస్టమర్లు కూడా హస్కీల్ని ముద్దు చేస్తూ వాళ్ల విందు చేయొచ్చు. వాటిని చూడాలంటే ముందుగా రుసుం కట్టి బుక్ చేసుకోవాల్సిందే. లేకుంటే బయట పడిగాపులు కాయాల్సిందే. అంత డిమాండ్ హస్కీలకి. గంటకు 350 భాట్‌లు అంటే అక్షరాల రూ.662 చెల్లించాలి. వీటికి కూడా కొన్ని నియమాలున్నాయి. పర్యాటకులు వాటితో ఆడుకునే అవకాశం 3 సార్లే. మిగతా సమయాల్లో అవి విశ్రాంతి తీసుకోవాలి కదా! వీటిని కలిసే ముందు ప్రోటోకాల్ పాటించాల్సిందే. శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. మన పాదాలకు ప్లాస్టిక్ షూ కవర్ వేసుకోవాలి. వాటి దగ్గర ఎలా ప్రవర్తించాలో ముందుగానే వీడియో చూపిస్తారు. వాటిని ఎంత ముద్దాడినా ఏమీ అనవు. ఎన్ని ఫొటోలు దిగినా విసుక్కోవు. వీర పోజులిస్తాయి. కానీ వాటి ముందు పరుగులు తీశామంటే అంతే సంగతులు. వేడి వాతావరణాన్ని భరించలేవని పా రోజూ హస్కీల దగ్గర గిన్నెలో ఐస్ ఉంచుతాడు. 24 గంటలు ఏసిలోనే. హస్కీలకు బోర్ కొట్టకుండా ఆస్ట్రేలియన్ గొర్రెలు, జపనీస్ అకిటా మరియు చిన్న షీ జూలను కూడా పెంచుతున్నాడు.

వింత లోకం

డబ్బు సూటు

కొంతమంది కోరికలు వింటుంటే ఓరి వీడి పైత్యం అనిపిస్తుంది. కరెన్సీ నోట్లను డ్రెస్‌గా కుట్టించుకుని తిరుగుతున్న దక్షిణాఫ్రికాకు చెందిన మైఖేల్ యాండైల్ ద్లామినీని గురించి వింటే పైత్యం పీక్స్‌లో ఉందని ఖరారు చేసేసుకుంటారు. నోట్లను ఎవరు లాక్కెలిపోతారోనని వాటికి కాపలాగా బాడీగార్డులు. ఇంత ఎచ్చులకు పోతున్న మనోడో మూలికా వైద్యుడు. ఆ ఆకు ఈ పిందె కలిపి పసరు నూరిపారేసి డబ్బులు బానే పిండుకుంటున్నాడు. మొన్న మొన్నటి వరకు బలుసాకు తిని బతకాల్సిన పరిస్థితి ఉండేది. కానీ జనాలు నమ్మేసి మందు కోసం క్యూలు కట్టేయడంతో ఒక్కసారిగా లోకల్ సెలెబ్రెటీ అయిపోయాడు. స్టేటస్ అట్టాగే కాపాడుకోవడం కోసం రకరకాల విన్యాసాలకు పోయి ఇలా చివరకు నోట్ల సూట్ వేసుకోవడం మొదలెట్టాడు. మైఖేల్ పిచ్చి ఎంత దూరం వెళ్లిందంటే చివరకు ఎవరిదైనా అంత్యక్రియల తంతుకు కూడా అదే అవతారంతో దిగిపోతున్నాడు. అస్సలింత సొమ్మెలా పోగు చేస్తున్నావని ఎవరైనా అడిగితే కలలోకి తాతొచ్చి ఫార్ములాలు చెప్పాడని కాకమ్మ కబుర్లు చెబుతున్నాడు. 12 ఏళ్లపుడు మాట వినలేదని ఇప్పుడు 33 ఏళ్లపుడు బాధ పడుతున్నాడు. 2011లో మరోసారి కలలోకి తాత వస్తే ఇలా ప్రాక్టీస్ మొదలెట్టేశానని 5 ఏళ్లలో ఈ రేంజ్‌కొచ్చేశానని గొప్పలు పోతున్నాడు. కథే కాదు అతడమ్మే మూలికా పసర్ల పేర్లు కూడా చాలా వింతగా ఉంటాయి.

మతి తప్పిన బహుమతి

పండుగలపుడు పిల్లలకు ఏదో ఒక సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇవ్వాలని తల్లిదండ్రుల ఆరాటం. కానీ ఎమ్మా మాట వింటే మాత్రం అది ఆరాటంలా అస్సలు అనిపించదు. మతి తప్పిన బహుమతుల తంటాలా తోస్తుంది. ఒకటో రెండో కొనేసి క్రిస్మస్ చెట్టుకు కట్టదు. వాటి సంఖ్య సెంచరీ కొట్టినా ఇంకా కడుతూనే ఉంటానంటుంది. రష్యాకు చెందిన ఎమ్మాకు పిల్లలపై ప్రేమకే కాదు వారికి కొనిచ్చే బహుమతులకు కూడా హద్దనేది ఉండదు. ఈ ఏడాది క్రిస్మస్‌కు ఏకంగా 96 గిఫ్ట్‌ను కొనటంతో బాటు ఆ విషయాన్ని సామాజిక మాధ్యమంలో పంచుకుంది. గతేడాది తన ముగ్గురి పిల్లలకు ఒక్కొక్కరికి 87 బహుమతులు కొనిందట. క్రిస్మస్ ట్రీ కూడా మునిగి పోయి వంగి పోయింది. ఇప్పటి నుంచే పిల్లలకు ఇలా అలవాటు చేస్తే ఇంకేమైనా ఉందా అంటూ బంధువులు, స్నేహితులు క్లాస్‌లు పీకుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తి పోస్తున్నారు. తమ పిల్లల్ని చెడగొడుతోందని ఇరుగు పొరుగు తిడుతున్నారు. అయినా తన గిఫ్ట్‌లు తన ఇష్టమని సెంచరీ కొట్టి తీరుతానంటోంది ఎమ్మా. తల్లిదండ్రులందరూ మీ అంత స్థితిమంతులు ఉండరు, పేద తల్లిదండ్రులు కూడా ఉంటారన్న విమర్శలు వస్తుంటే ఓ వివరణ ఇచ్చి విషయాన్ని కూల్ చేసే ప్రయత్నం చేసింది. కేవలం క్రిస్మస్ పండుగకే బహుమతులు కొనిస్తానని మిగతా సంవత్సరమంతా ఏమీ కొనివ్వనని పోస్ట్ చేసింది. సెలవుల్లో విదేశాలకు, విహారయాత్రలకు వెళ్లడం, వేలాది రూపాయలు ఖర్చు చేయడం లేదని టీవీ ఇంటర్వ్యూలోను చెప్పింది. గిఫ్ట్‌ల కొనుగోలు జులైలో ప్రారంభించి నవంబర్‌కి పూర్తి చేస్తుందట. ఏంటో ఈ లెక్క.

తేనెలూరే చిత్రకళ

తేనె వనాల్లో ఓ చిత్ర కళ మహిళల వేళ్ల మీద నుంచి జాలువారింది. పసుపు, కుంకుమ, ముగ్గు, బొగ్గు, ఆవు పేడ, బంకమట్టితో చేసిన రంగులతో ఇంటి లోపలి గోడలపై వర్ణ చిత్రంగా చిలికింది. నాలుగ్గోడల్ని దాటి ప్రపంచ నలుమూలలకు... గృహిణుల రేఖల నుంచి పికాసో గీతలేమోననే స్థాయిని అందుకుని గొప్ప కళగా వెల్లివిరిసింది. మధుబని వర్ణచిత్రాల కథలోని ప్రతి దృశ్యం విచిత్రంగానే ఉంటుంది.

ఆ చిత్ర కళ విశేషాలివే..

వేల ఏళ్ల నాటి ఈ నిగూఢ కళ పదుల ఏళ్ల క్రితమే వంటింటిని, వరండాను దాటుకుని పెరటి గుమ్మం తలుపుల్ని దబేలునా తోసేసి ప్రఖ్యాత ఆర్ట్ గేలరీల ఫ్రేమ్‌ల్లో సింహాసనమెక్కింది మధుబని. టీ కప్పు నుంచి టీ-షర్ట్ వరకు ప్రతి వస్తువుపై... జానపద కథల నుంచి నేటి ఇతివృత్తాల వరకు ప్రతి కథా వస్తువును చిత్రించేస్తున్న మధుబని చిత్ర కళ ఇప్పుడు చెట్లను కూడా అల్లేసుకుని, హత్తేసుకుని కాపాడే ప్రయత్నం చేస్తోంది. మధుబని అనేది ఒకప్పటి మహా సామ్రాజ్యాల్లోని ఓ ప్రాంతం. ఉత్తర బీహార్ నుంచి నేపాల్ వరకు విస్తరించుకున్న అటవీ ప్రాంతానిదా పేరు. మిథిలా రాజ్యం వృత్తాంతాన్ని అద్దుకున్న మధుబని ప్రాంతంలో గృహిణులు అందుబాటులో ఉన్న సామగ్రి, రంగులతో ఇళ్ల ముందు రంగుల బదులు గోడలపై చిత్రాల్ని వేసేవారు. వీటికి ప్రత్యేకమైన కుంచెలు వగైరా వగైరా ఏమీ ఉండేవి కాదు. లేత కొమ్మలు, చివుళ్లు, చేతి వేళ్లతోనే అందాన్ని అద్దేసేవారు. నాలుగు గోడలకే పరిమితమైన ఒంటరి బతుకుల నుంచి కాసింత సంతృప్తి కోసం వారు ఈ చిత్రాల్ని వేసేవారని అంటారు. ప్రతి కులం, ప్రతి కుటుంబం, ప్రతి ఇంటిలో మధుబని చిత్రం నిలువెత్తున ఎదిగింది. దేవుళ్ల బొమ్మల నుంచి ప్రకృతి దృశ్యాలకు అక్కడి నుంచి నేటి సవాళ్ల వరకు ఆర్ట్‌ఫార్మ్ మారిపోయింది.

భూకంపం బయటపెట్టింది

మధుబని చిత్ర కళ గురించి 1934 వరకు బయటి ప్రపంచానికి తెలీదు. కానీ ఆ ఏడాది నేపాల్‌లో వచ్చిన భూకంపం వల్ల ఇళ్లు విరిగాయి. వాటి ఫొటోల్ని తీసేందుకు వెళ్లిన బ్రిటిష్ ఫొటోగ్రాఫర్, అధికారి విలియం జి.ఆర్చర్‌ను విస్మయంలో పడేసినవి శిథిల దృశ్యాలు కాదు.. మధుబని చిత్రాలు. ఏ ఇంటి గోడపై చూసినా ఎంతో ఆకర్షణీయంగా ఒకే రీతిన ఉన్న చిత్రాలన్నీ ఓ గొప్ప కళా వస్తువులుగా కనిపించాయి. వాటిని ఫొటోలు తీసి పశ్చిమ దేశానికి పరిచయం చేశాడు. తాను రచించిన పుస్తకాల్లో ప్రత్యేక అధ్యాయాలను ఇచ్చాడు. అలా బయటపడిన ఆ కళ స్వేచ్ఛగా ప్రపంచమంతా విహరించి అనేక దేశాల్లో కళాభిమానుల్ని సొంతం చేసుకుంది. 1960 దశకం నుంచి ఆదరణ పెరిగింది. కళాకారులను ప్రపంచం గుర్తించింది. అప్పటి నుంచే అది ఇంటి గోడలను దాటి కాన్వాస్‌లపైకి ఎక్కింది. అనేక రూపాల్లో అందరి వద్దకు చేరింది. గోధ్నా, మైథిలి, చిత్ర వంటి ప్రత్యేక శైలులు అభివృద్ధి చెందితే.. కుటుంబానికి, గ్రామానికో శైలులు విస్తరించాయి.. ఎన్నో కాలగర్భంలో కలసిపోయాయి. ఈ ఆర్ట్‌లో విశేషమేమంటే ఇప్పటికీ కూడా ప్రకృతి హిత సహజ రంగులనే వాడతారు. ఇలాగే కాకుండా కొన్నేళ్ల నుంచి పర్యావరణ పరిరక్షణకు కూడా మధుబని చిత్ర కళను ఉపయోగిస్తున్నారు... సామాన్య బీహారీ మహిళలు. అడవుల నరికివేతకు అడ్డుకట్ట వేయడం కోసం స్థానిక గ్రామ దేవతలు, వన దేవతల రూపాలు, ఘట్టాలతో మహా వృక్షాలపై చిత్రాలను వేస్తున్నారు. ఈ ఆలోచన ఫలించింది. చెట్లను నరికితే ప్రమాదమని వాటి జోలికెళ్లడం మానేశారు. ఈ చిత్రకళలో వృక్షాలు, వన్య ప్రాణుల చిత్రాలను ప్రేమ, రక్షణ వంటి వివిధ భావాలకు ప్రతీకగా వాడుతుంటారు. చివరకు ఈ చిత్ర కళే వాటికి సంరక్షణనిస్తోంది.

జపాన్‌లో శాశ్వతంగా..

మధుబని చిత్ర కళను ఎక్కువగా ఆదరించినవాళ్లు జపనీయులు. జపాన్‌లోని టోకామాచి కొండల్లో ఉన్న నిగాటా ప్రాంతంలో 'మిథిలా మ్యూజియం' ఉంది. ఇక్కడ దాదాపు 15 వేలకు పైగా మధుబని వర్ణచిత్రాల్ని కొలువుదీర్చారు. టోకియో హసేగవా అనే జపాన్ సంగీత కళాకారుడు, మధుబని కళా పిపాసి ఆలోచనల నుంచి పుట్టుకువచ్చిందే ఈ మ్యూజియం. జపాన్‌లో ఓ పురాతన చిత్ర కళ 'ఉకియోయే' దాదాపుగా అంతరించిపోయింది. కళాభిమాని అయిన టోకియో 'ఉకియోయే'ని బతికించుకోడానికి చేయని ప్రయత్నం లేదు. వర్ణ చిత్రాల్ని సేకరించి శాశ్వతంగా భద్రపరచాలన్న ఆయన ప్రయత్నం విఫలమైంది. సరిగ్గా అదే సమయంలో 1982లో భారత పర్యటనకు వచ్చిన కొందరు కళా రంగ విద్యార్థులు తమ వెంట 80 మధుబని పెయింటింగ్స్‌ను తీసుకెళ్లారు. వాటిని టోకియో వద్దకు తీసుకెళ్లి ప్రదర్శించాలని కోరారు. టోక్యోవాసి అయిన టోకియో సంగీత సాధన కోసం, ప్రశాంతత కోసం నగర జీవనానికి దూరంగా టోకామాచి కొండల్లో ఆవాసం ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే మధుబని చిత్రాలకు స్థానం కల్పించాడు. ఆ చిత్రకళతో ప్రేమలో పడిపోయిన టోకియో క్రమంగా తానే సొంతంగా మధుబని చిత్రాల్ని సేకరించడం మొదలెట్టాడు. తొలుత ఒక ఖాళీ పాఠశాల ఆవరణలో చిన్నగా మొదలై అంచెలంచెలుగా శాశ్వతంగా ఆ కళ నిలిచిపోయే మ్యూజియాన్ని ఆవిష్కరించాడు. మధుబని కోసమే భారత్‌కు 20కు పైమార్లు యాత్రలు సాగించాడు. గ్రామం గ్రామం తిరిగి ఒక్కో శైలిని తెలుసుకుంటూ ప్రతి అద్భుతాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. మధుబని కళలో ఖ్యాతిగడించిన గంగాదేవి వంటి కళాకారులను జపాన్ తీసుకెళ్లి అనేక కార్యక్రమాల ద్వారా ఆ చిత్ర కళపై ప్రచారం చేశాడు.

- అనన్య ప్రసిద్ధ్

చుక్కల సెలయేళ్లు

వివరం



చుక్కలతో మాట్లాడి చాలా రోజులైంది. తారల్ని చూస్తూ తలవాల్చి ఏళ్లు గడిచాయి. ఇన్ని వేల చుక్కల్లో ప్రేయసిని వెతుకుతూ చేసిన ఓ నిరీక్షణ గాథ.. నక్షత్రాలతో బంధాల్ని రాసుకున్న ఓ అన్నా చెల్లెళ్ల కథ... ఎన్నో మిణుకు మిణుకు వెలుగులు. ఇలా హృదయాల్ని కదిల్చేవే కాదు అనంత విశ్వంతో ఈ చిన్ని అస్తిత్వాన్ని కనెక్ట్ చేసుకునే అవకాశం కోసం తెల్లారి పొద్దుల వరకు కనురెప్ప వాల్చని మనసులెన్నో. అవును చుక్కల లెక్కల్లో మనం మిస్సయిపోతాం. రాశులు, కాల గమనాలు, సైన్సు-ఫిక్షనూ అంతా పక్కన పెడితే ప్రతి ఒక్కరికి తనదైన అనుబంధం ఆకాశ రాత్రులతో. కవుల్ని చేసింది, దారి చూపింది, కుప్ప కూల్చింది, సంభ్రమంలోకి నెట్టింది ఆ నక్షత్రాల నడిరేయి. చిట్టి పొట్టి తెరల్లో కళ్లు కదలిపోతున్న ఈ కాలంలో కనుమూలల్ని కప్పేసే భారీ చిత్రం చూస్తే అదో కొంగొత్త అనుభవమే. అదో అద్భుత దృశ్యమే. మరి వీటిని ఎక్కడ చూడాలి. నగరాల్లో పొగ కప్పేస్తోంది. పల్లెల్ని కాలుష్యం ముంచేస్తోంది. అందుకే ఆకాశ దీపాల తళుకుబెళుకులు ఆస్వాదించలేకున్నాం. ఆకాశం పిండారబోసిందనే మాట ఈ తరం బుర్రలో వెలిగే సరికి తెల్లారైపోతుంది. తారాజువ్వలంటే దీపావళికి ఆకాశంలోకి పంపే టపాసులనుకునేంత దూరానికి చేరిపోయింది నగరం. చుక్కల ముగ్గులు గుమ్మంలో వాలిన అంతరిక్షమంటే కిసుక్కుమనే రంగేళీల గోలలో పడిపోయింది గ్రామం. సూరీడు, చందమామల హాయ్... బైలనే సరిగ్గా పట్టించుకునే దిక్కేలేని వారికి తొలి చుక్క పొడిచిందంటే అర్థమయ్యే చాన్సే లేదేమో. కానీ ఇంకా ఏకాంతాలు, పరిష్వంగాలు, ప్రేమ బాసలు, కెరీర్ ఊసులు నక్షత్రాలతో చెప్పుకునే వాళ్లు మిగిలే ఉన్నారు. అంతరిక్షాన్ని రెండు చేతులు చాచి హత్తుకునే ప్రయత్నం చేసేవాళ్లు తళుకుమంటూనే ఉన్నారు. టెంట్‌ల పక్కనే టెలిస్కోప్ బిగించుకుని నిద్రాహారాల్ని మరచి నక్షత్ర లోకంలో మైమరిచే సీరియస్ స్టార్ గేజర్‌లు మెరుస్తూనే ఉన్నారు. ఈ నిశాచర ప్రేమికుల కోసం దేశంలో కొన్ని ప్రత్యేకమైన ప్రాంతాలున్నాయి. అవి నక్షత్రాల్ని జల్లేసుకున్నాయి. స్టార్ డస్ట్‌ను జలదరిస్తున్నాయి. ఆకాశాన్ని విరిచి మీ మీద పడేస్తున్నంత దగ్గరగా, స్పష్టంగా చుక్కల్ని నేల దించుతున్నాయి. మన సిక్కోలు, మన్యం, హార్స్‌లీ హిల్స్, నల్లమల, శేషాచలంతో పాటు ఎన్నో ప్రదేశాలు దగ్గరలో ఉన్నాయి. ఇవి కాకుండా దేశంలో రాత్రులు విరబూసే ఆ తారాతీరాలు.. నక్షత్రపాతాల దర్పిణులివే.

జైసల్మేర్

ఎడారి ఇసుక రేణువుల్ని ఆకాశంలో జల్లినంత దట్టంగా నక్షత్రాలు కనిపిస్తాయి జైసల్మేర్ రాత్రులలో. ఇక్కడ రాత్రులు క్యాంపింగ్ వేసేవారు తమ గుడారాల్లోంచి బయటకు వచ్చి ప్రశాంతంగా ఆకాశాన్ని చూస్తూ ఆనందిస్తుంటారు. కాలుష్య ప్రభావానికి దూరంగా ఉన్న ప్రాంతాన్ని ఎంచుకుని టెంట్‌లు వేసుకునే స్టార్ గేజర్‌లకు జైసల్మేర్ అంటే ఎందుకంత ఇష్టమంటే ఇక్కడ నలుచదరంగా ఎత్తైనవేవి ఉండవు. ఆకాశం దుప్పటి కప్పుకున్న తీరున రాత్రులు అనిపిస్తాయి. చుక్కల సంద్రంలో పడిపోతున్న భ్రమ కలిగినా ఆశ్చర్యం లేదంటారు.

లఢాక్

సాహసోపేతమైన బైక్ రైడ్‌లకే కాదు నక్షత్ర వీక్షకులకు లఢక్ ఓ హాట్ స్పాట్. ఇక్కడి శాంతి స్థూప వద్ద రాత్రులు ఆకాశం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. పాలపుంత అందివచ్చిందనేలా భావన కలుగుతుంది. అందుకే ఇక్కడ దగ్గరలోనే హాన్లే అబ్జర్వేటరీని నిర్మించారు. ఇక ఆ అబ్జర్వేటరీ నుంచి తారా లోకాన్ని వీక్షించాలనేది స్టార్

'ప్రణామం ప్రణామం ప్రణామం ప్రభాత సూర్యునికి ప్రణామం... ప్రమోదం ప్రమోదం ప్రమోదం ప్రతీ సృష్టి చిత్రం ప్రమోదం' పాట వింటుంటే మదిలో సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు కదిలిపోతుంటాయి. మేఘాల పరుగులు, జలపాతాల పరవళ్లు, సెలయేళ్ల సందళ్లన్ని తడిమిపోతుంటాయి. ఇవి ప్రకృతి ప్రేమికుడి గుండెను తడి చేసే డిటైల్స్, వాటిల్లో నక్షత్ర వీక్షణకు కూడా ఆకాశమంత చోటుంటుంది. తారా తీరంలో మనసు కళ్లప్పగించుకుని జీవితంలో ఓ రాత్రైనా ఉండాలనేది స్టార్ గేజర్ కల. వీలు చూసుకుని మరీ చుక్కల సెలయేళ్లలో కాసింత సేద తీరాలనేది నక్షత్ర వీక్షకుని తపన. ఆకాశ దీపాలతో కనెక్షన్ అలాంటిది. అన్నీ ఇచ్చిన ఈ భూమినే కాదనుకుని చుక్కల లోకంలో తప్పిపోవాలని.... స్టార్ డస్ట్ నుంచే వికసించానని... వాటికే తాను సొంతమనేంత బలమైనది నక్షత్రాలతో మనిషి బంధం. మరి ఆ స్టార్ గేజర్ల మనసును తేలికపరిచే ప్రదేశాలు దేశంలో చాలానే ఉన్నాయి. వాటి వివరం ఈ వారం మీ కోసం...

గేజర్‌ల అతి పెద్ద స్వప్నాల్లో ఒకటి. నక్షత్ర మండలాల్లో తేలిన ఫీలింగ్ సొంతమవుతుంది.

తర్కాలి

కొంకణి స్వచ్ఛలోకం చూడాలంటే తర్కాలి వెళ్లాలి. నగర జీవనానికి దూరంగా కాలుష్యానికి సుదూరంగా పర్వతాలు, సముద్ర తీరాలు, జలపాతాలతో పాటు అద్దంలాంటి ఆకాశం తర్కాలి సొంతం. అందుకే రాత్రులు ఇక్కడ వేన వేల చుక్కల వెలుగులతో తళుకులీనుతాయి.

మాథెరన్

స్టార్ గేజర్ల కోసమే భారత్‌లో ఏదైనా ప్రాంతముందంటే అది మాథెరన్. ఇక్కడ వాహనాల్ని అనుమతించరు. నక్షత్ర వీక్షకుల కోసం ఎకో పాయింట్, హార్ట్ పాయింట్ అనే వ్యూపాయింట్‌లు ప్రత్యేకంగా ఉంటాయి.

స్పితీ లోయ

లోయల్లో వెలుగు పూలు విరగబూసాయేమో అనిపిస్తుంది స్పితి లోయలో రాత్రుళ్లు తిరిగితే. పర్వతాల మధ్య నుంచి చుక్కలు దొర్లిపడేలా కనిపించే ఆ పాలపుంత చిత్రాన్ని ఎప్పటికీ మరిచిపోలేరు. వాహనాలపై చేరుకోగలిగిన ప్రపంచంలోనే అతి ఎత్తైన గ్రామం కిబ్బర్ ఈ ప్రాంతంలోనిదే.

ర్యాన్ ఆఫ్ కచ్

సూరీడి రాకపోకల్ని చూడాలంటే ర్యాన్ ఆఫ్ కచ్‌లో క్యాంప్ వేయాల్సిందే. అదే చోట తారల విలాసాన్ని చూసి కేరింతలు కొట్టొచ్చు. ఉప్పు ఎడారి అంతా తెల్లగా మంచులా మెరిసిపోతుంటుందిక్కడ.



స్టార్ గేజర్ల కోసం ఓ టెలిస్కోప్ పెట్టుకుని రెడీగా ఉంటుంది యెర్కాడ్‌లోని లేడీస్ సీట్ స్పాట్. తమిళనాడులోని సేలం దగ్గరలో ఉండే యెర్కాడ్ ఓ హిల్‌స్టేషన్. సముద్ర మట్టానికి 4970 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రాంతంలో పెద్ద సరస్సు, అడవి ఉండటంతో లేక్ ఫారెస్ట్ అని పిలుస్తారు. దక్షిణ మణిగా కూడా పేరుంది. ఇక్కడ నక్షత్రాలు కూడా ఆకాశంలో దట్టంగా గుమికూడి తారారణ్యం వెల్లివిరుస్తుంది.

ఇవే కాదు కర్నాటక కాశ్మీర్‌గాను, భారత స్కాట్లాండ్‌గాను పిలిచే కూర్గ్ (కొడగు) ప్రకృతిని హత్తుకునేందుకు కిందకు దిగొచ్చే ప్రయత్నం చేస్తుందా అనిపిస్తుంది నక్షత్ర లోకాన్ని రాత్రులు చూస్తే. పచ్చని లోయలు, పొగమంచు కొండలు పగటి పూట ప్రకృతి నెచ్చెలితో నడిపిస్తే... తారా విహారంలో నిశీధులు రెప్ప వాల్చనీయవు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద క్రేటర్ అయిన లోనార్ సరస్సు నీటిని నక్షత్రాలకు అద్దం పడుతుంది. మహారాష్ట్ర బుల్దానాలోని లోనార్ కూడా చక్కటి ప్రకృతి ప్రాంతమే. అదే రాష్ట్రంలోని జున్నార్ ప్రాంతంలో నానేఘాట్ హిల్‌స్టేషన్ కూడా నక్షత్ర వీక్షణకు కేంద్రం. పశ్చిమ కనుమల్లోని నానేఘాట్ నిచ్చెన వేసుకుని తారల్ని అందుకున్న భావన కలిగిస్తుంది. ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్, కర్నాటకలోని ఉడుపి, సిక్కింలోని గ్యాంగ్‌టక్, ఒడిశాలోని చిల్కా సరస్సు, మహారాష్ట్రలోని భండార్‌ధార, ఉత్తరాఖండ్‌లోని కువారి పాస్, హిమాచల్ ప్రదేశ్‌లోని హాతూ శిఖరం, రాజస్థాన్‌లోని బికనీర్, అండమాన్‌లోని నీల్ ద్వీపం, జమ్మూకాశ్మీర్‌లోని ప్యాంగ్‌యాంగ్ ట్సో, సిక్కింలోని కటావో, కోల్‌కతా దగ్గరలోని మందారమనిలు కూడా స్టార్ గేజర్లకు డే అండ్ నైట్ అనుభూతుల్ని మిగులుస్తాయి.

మరికొన్ని చోట్ల కూడా నక్షత్రాలు స్పష్టంగా కనిపించొచ్చు. కానీ, ఈ ప్రాంతాల నుంచి చూస్తే అదో కొత్త, వింత చుక్కల లోకాన్ని కళ్లారా చూసి కనుపాపల్లో దాచేసుకోవచ్చు. ప్రకృతి రమణీయతకు, భిన్నమైన నైసర్గికతకు, భూమితో కొత్త స్పృహకు ఆలవాలాలైన ఈ ప్రాంతాలు పగటి పూట కూడా పర్యాటకుల మనసులను సేద దీరుస్తాయి. ప్రకృతితో కనెక్ట్ చేస్తాయి.

- ఏజే



హ్యాన్లే అబ్జర్వేటరీ

స్పితి లోయ



యెర్కాడ్



రూపాయి పోరాటం

కవిత్వం

రోజల్లా
నడిచే ప్రయాణాన్ని
ముక్కలుగా విరిచి
కన్నీళ్లనే తొడగటం.

అర్ధరాత్రి నిర్ణయాల
ముసుగుల్లో ముంచెత్తటాలు
ఒక విధ్వంసపు ఆనవాలు.

నల్ల కుబేరులెప్పుడూ
రూపాయిని వివిధ రూపాలుగా తొడుక్కుంటారు.

ఇప్పుడు
విరిగిన సగం జీవితం
సామాన్యుడి పైనో
మధ్యతరగతి గానో
విలవిలలాడుతూ
ప్రాణాలు ఆఖరి శ్వాసగా
విడవబడు తున్నాయి.

పనులు గాల్లో కలిసి
బారులు కట్టిన జనం
బ్యాంకుల చుట్టూ యుద్ధం
ప్రాణం గుప్పిట తల్లడిల్లుతూ
ప్రణాళిక లేని పెద్ద వ్యవహారానికి
బలౌతూ ప్రణమిల్లుతూ
ఒక పరిష్కారానికి
ఎదురు చూపులు
పోరాడుతున్నాయి.

- గవిడి శ్రీనివాస్
8886174458

గాయపడిన పక్షి అది!

గాయపడిన పక్షి అది
సలుపుతున్న గాయానికి
ఆత్మీయ లేపనం పూసి
కట్టు కట్టగలరా ఎవరయినా...
ఇంకి పోతున్న ఊరి చెరువది
చెమట చుక్కలతో తడిపి
తవ్వి పొంతం చేసి
కురిసే వాన చినుకును
ఒడిసి పట్టగలరా ఎవరయినా
మోడు వారుతున్న చెట్టు అది
కాసిన్ని కన్నీళ్లను పోసి
ప్రేమ అనే ఎరువును చల్లి
వసంతాన్ని పూయించగలరా
ఎవరయినా...
మూగబోతున్న కోయిల స్వరమది
ఊపిరులూది సరికొత్త పాటను
మధురాయమానంగా
పాడించగలరా ఎవరయినా....
వసివాడిపోతున్న
మల్లె పూల వనమది
కాస్తంత వెలుతురూ నీళ్లను
చిలకరించి....
పరిమళభరితం చేయగలరా
ఎవరయినా....
విస్తరిస్తున్న ఎడారి అది
బతుకు నీటి చెలిమెలు
తవ్వగలరా ఎవరయినా...
నాగరికతా రాబందులు
వాలిన నేల అది
సంస్మృతీ మూలాలను
పరిరక్షించగలరా ఎవరయినా...
వెన్నెముకలు విరిగిపడుతున్న
ప్రాంతమది
పేద గుడిసెకు నిట్టాడిలా
నిలవగలరా ఎవరైనా...
సమస్త వృత్తులు
వలసపోతున్న జీవన చిత్రమది
బతుకు తెరువు చూపించే
చూపుడు వేలు కాగలరా
ఎవరయినా...
కొడిగడుతున్న దీపమది
ఒత్తిని సరి చేసి
కాస్తంత ఉపాధిని పోసి
మళ్లీ వెలిగించగలరా
ఎవరయినా...
నా దేశం చెట్టుకు పట్టు గొమ్మ అది
కూర్చున్న కొమ్మనే
నరుక్కుంటున్న మూర్ఖుల్ని
నిలువరించగలరా ఎవరయినా...
ఖాళీ అవుతున్న ఊరు అది
కాలిపోతున్న కలల్ని
పున: ప్రతిష్ట చేయగలరా
ఎవరయినా...

- చిత్తలూరి
9133832246

విజేత

వీల్ చెయిర్‌ను పర్వతమెక్కించి..

పర్వతారోహణలో ఆయనో చాంపియన్. నాలుగు సార్లు ఏసియన్ రాక్ క్లైంబింగ్ విజేతగా నిలిచి మరో పోటీకి కసరత్తును పూర్తిచేశాడు. ఇంతలో ఊహించని ఓ ప్రమాదం తన కాళ్లని నిస్సత్తువగా మార్చింది. ప్రాణాపాయ స్థితిలోనూ శరీరానికి కలిగిన దెబ్బల కంటే ధ్యాస ఆశయం వైపు పరుగులు తీసింది. ఆ ఆశయాన్ని పూర్తిచేయడానికి కావాల్సిన మనోధైర్యాన్ని మరో క్రీడ ద్వారా పోగేసుకున్నాడు. ఈసారి పర్వతారోహణ వీల్ చైర్‌తో మొదలైంది. అతిక్లిష్టమైన ఈ పోటీలో ప్రాణాలు దక్కితే అదే చాలనుకున్నారందరూ. 500 మీటర్ల ఎత్తున్న లైన్ రాక్ పర్వతాల అధిరోహణని వీల్‌చైర్‌తోనే పూర్తిచేసి విజేతగా రికార్డు సొంతం చేసుకున్నాడు లైచి వై. వీల్ చెయిర్‌కు పర్వత శిఖరం ఎలా ఉంటుందో చూపించిన తొలి వ్యక్తి ఆయనేనేమో.

ఆగ్నేయ చైనాలోని హాంకాంగ్‌కి చెందిన లైచి వై (33) పర్వతాధిరోహణలో ఒక అసాధారణ క్రీడాకారుడు. కొన్ని సంవత్సరాలుగా రాక్ క్లైబింగ్‌లో కొనసాగుతున్న లైచి జాతీయ, అంతర్జాతీయ విజయాలని సొంతంచేసుకున్నాడు. అసంఖ్యాకమైన విజయాల ద్వారా పర్వతారోహణలో తిరుగులేని వ్యక్తిగా మారిన 28 సంవత్సరాల లైచి జీవితంలో చోటుచేసుకున్న ఒక ప్రమాదకర సంఘటన తన ఆశల్ని తారుమారుచేసింది. కారు యాక్సిడెంట్ కారణంగా పక్షవాతంతో లైచి క్రింది శరీర భాగం చచ్చుబడిపోయింది. ఇక తన ఆశయాలని పక్కన పెట్టమని ఎందుకంటే మిగిలిన జీవితం పూర్తిగా వీల్‌చైర్‌లోనే గడపాల్సి ఉందని డాక్టర్లు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీర్ఘకాల చికిత్స కారణంగా తన అభిమాన క్రీడని చాలా కాలం పక్కన పెట్టాల్సొచ్చింది. తల్లిదండ్రులు, మిత్రులలానే అందరూ వీల్‌చైర్‌కి పరిమితమైన లైచి తన క్రీడా కెరీర్‌కి పూర్తిగా దూరమవుతాడనుకున్నారు. అయితే అతని క్రీడా స్ఫూర్తి, బలమైన సంకల్పం అతన్ని రాక్ క్లైంబ్ బోధకునిగా మార్చింది. గాయాల నుంచి నెమ్మదిగా కోలుకుంటున్న లైచి అప్పటి వరకు తనకి పరిచయంలేని ఒక కొత్త క్రీడపై అభిరుచి పెంచుకున్నాడు. తన పాత చేదు జ్ఞాపకాల నుంచి బయటపడేందుకు దోహద పడిన వీల్‌చైర్ బాక్సింగ్ ద్వారా మానసిక, శారీరిక ధృడత్వాన్ని పెంపొందించుకున్నాడు. ఎవరూ ఊహించని విధంగా ఐదేళ్ల తర్వాత తన మిత్రులతో కలసి పర్వతారోహణలో మళ్లీ శిక్షణ మొదలు పెట్టాడు లైచి. ఈ సారి తనచేతుల్లో పట్టు పెరిగింది. వీల్‌చైర్‌ని బలంగా ముందుకు నెడుతూ ఆశయసాధన కోసం పర్వతాలపైకి ఎగపాకాడు లైచి. అపజాయాలు ఎదురౌతున్న కొద్దీ తనలో మరింత పట్టుదల మొదలైంది. ఈ సమయంలోనే తనకి కొడుకు పుట్టడంతో ఆ ఆనందం తనకి మరింత బలాన్ని తెచ్చిపెట్టింది. అప్పుడే మరో లైన్ రాక్ పర్వతారోహణం పూర్తిచేయాలనే ఒట్టు పెట్టుకున్నాడు లైచి. తను చేసిన ఈ ప్రకటన లైచి మిత్రుల్లో మరింత ఆందోళనని పెంచింది. ఎందుకంటే వీల్‌చైర్‌లో పర్వతాలన్ని ఎక్కడమంటే ప్రాణాల్ని పణంగా పెట్టినట్టే. ఇలాంటి సాహసాలు వాళ్లు మునుపెప్పుడూ

చూడలేదు. అయితే లైచి పట్టుదల, కఠోర శ్రమని చూశాక వీల్‌చైర్‌లో పర్వతారోహణం చేయడమనేది అతనికి మాత్రమే సాధ్యపడుతుందనే నమ్మకం బలపడింది. వారు ఊహించినట్టే 2016 డిసెంబర్ 9న తన కాళ్లకి ప్రత్యేక పరికరాల్ని అమర్చుకుని వీల్‌చైర్‌తో లైన్ టాప్ గ్రానైట్ పర్వతాల శిఖరాగ్రానికి చేరుకున్నాడు లైచి. 500 మీటర్ల ఎత్తుకి నాలుగు గంటల్లో ఎగబాకి వీల్‌చైర్‌లో పర్వ తారోహణ పూర్తిచేసిన తొలి దివ్యాంగుడిగా రికార్డుని సొంతం చేసుకున్నాడు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కాలానికి ఎదురునిలిచి తన ఆశయాన్ని నెరవేర్చుకున్న లైచి హాంకాంగ్ వాసులకి ఒక రోల్ మోడల్. పర్వతారోహణలో శిక్షణని వ్వడంతోపాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహపడే గురువుగా మారాడీ విజేత.

ఎద సవ్వడి



- కళ్యాణదుర్గం స్వర్ణలత
9848626114

"ఇవాళే వస్తారా? ఎన్నింటికి? ఎంతమంది?" అడిగా...

"ఔనండి సాయంత్రం 4 గంటలకు, 8 నుండి పదిమంది దాకా వస్తాము. ఓకే కదా" అందావిడ. "ఆ పర్లేదు వచ్చేయండి. ఓకే నాకు ఓకే"నే అంటూ ఫోన్ పెట్టేసి ఆయన్ను కేకేసా.

"ఏమండీ ఈవాళే వస్తామంటున్నారు వాళ్ళు.. మరి అరేంజ్‌మెంట్స్ అన్నీ చేసుకోవాలి. మీరూ కాస్త పనిలో సాయం పట్టండి సరిపోతుంది. ఇంతకూ అమ్మాయి మధ్యాహ్నాం వచ్చేస్తుంది కదా! తనకోసారి కాల్ చేయాలి" అంటూ మొబైల్ తీసి ఫేవరేట్ తీసా. మొబైల్‌లో అందమైన ఆ నవ్వు మొహం కన్పించగానే గుండెలు నిండిపోతాయి. ఇందూకు కాల్ వెళ్తోంది. 'హాయ్ అమ్మ!' తియ్యనైన స్వరం.. "హాయ్ నాన్నా..

ఇందూ బయల్దేరావు కదా!" అన్నా.

"ఔనమ్మ 6–30కే బస్ ఎక్కాను. 11లోగా వచ్చేస్తా.

డాడీ వున్నారా ఇంట్లో. ఇంట్లోనే వుండమను నేనొచ్చాక తనకో సర్‌ప్రైజ్ ఓకే నా" అని కాల్ కట్ చేసింది తాను.

ఇందూ.. ఓ ప్రియమైన పేరు పలుకుతుంటేనే సంతోషం ఉప్పొంగుతుంది. చిన్నప్పుడు... గులాబీ రంగు ఫ్రాక్ మొదటిసారి తనకు వేసి ఎంత ముచ్చటపడ్డానని. నిమ్మపండు రంగు, మామిడిపండు బుగ్గలు ముద్దుగా బొద్దుగా ఇందు.

రెండు పిలకలు కట్టి కొత్త ఫ్రాక్ వేస్తే.. అబ్బో అందరూ ఎత్తుకోవడమే ఇందూ, ఇందూ.. అని అందరినీ కలుపుకుంటూ, సంతోషాలను పంచుకుంటూ నా ఇందూ..

'జనులా పుత్రుని కనుగొని పొగడక...' పుత్రోత్సాహం అంటారు కానీ నాకైతే ఎప్పుడూ పుత్రికోత్సాహమే. తాను పుట్టినప్పటి నుండి చేసే ప్రతి పనిలో ఓ శ్రద్ధ ఓ ప్రత్యేకత.. చేసే విధానంతో ఓ స్టైల్.

'విన్నర్స్ నెవర్ డు డిఫరెంట్ థింగ్స్, బట్ దే డు థింగ్స్ డిఫరెంట్లీ' తన కోసమే రాసుంటారన్పిస్తుంది. అందుకేనేమో తానెప్పుడు విజయాల బాటలో..

క్లాసులో ఎప్పుడూ టాప్ ర్యాంక్. స్కూలుకు నేను వెళ్ళగానే నాకో ప్రత్యేకమైన గుర్తింపు. 'హే.. ఇందూ వాళ్ల మదర్ వచ్చిందని..' తన వల్లే ఆ గుర్తింపు.

అంతవరకు నన్ను నా పేరుతో పిలవడమో...లేదా నాన్న కూతురుగా సంబోధించడమో.. ఇంకా ఆయన పేరు చెప్పి.. వాళ్లావిడ అనడమో చేసేవారు. మొదటిసారి వాళ్ల టీచర్ ఇందూ వాళ్ల మదర్ అని నన్ను మిగతా పేరెంట్స్‌కు పరిచయం చేశారు. ఆ పిలుపు... ఆ పరిచయం కొత్తగా హాయిగా, అప్పట్నుంచి ఎక్కువసార్లు, ఎక్కువ సందర్భాల్లో నేను ఇందూ వాళ్ల మదర్‌గానే చాలా మందికి పరిచయం.

తనది చక్కటి స్వరం, ఆ స్వరంలో సన్నని ప్రవాహంలా ఓ ఆత్మీయ భావన విన్న ప్రతి ఒక్కరినీ తనవైపుకు తిప్పుకుంటుందంతే. చాలాసార్లే అన్పిస్తుంది. 'యస్..షి ఈజ్ మై డాటర్ నా ఇందు..' అని.

ఆ భావన కల్గిన ప్రతిసారీ ఓ అద్భుతమైన తృప్తి గుండెలను నింపేస్తుంది. గర్వంతో నా బుగ్గలు మరింత మెరుస్తాయి. నిన్నో మొన్నో తనను మొదటిసారి ఎత్తుకున్నట్లే. పొత్తిళ్లల్లో పడుకున్నట్లే ఉంది.... అప్పుడే 22 ఏళ్లు అయిపోయాయి. తానెదుగుతూ ఉంటే ప్రతిసారీ విజయాల విహంగమై ఎగురుతూ వుంటే కళ్ళార్పకుండా తనను చూస్తూ వుండడమేగా నా పని. కాలేజీ డిగ్రీ.. క్యాంపస్ ఇంటర్వ్యూస్.. సెలెక్షన్.. జాబ్ అన్నీ వెంట వెంటనే జలపాతంలో నీళ్లు జలజలా జారి ప్రవహించినట్లు వేగంగా జరిగిపోయాయి. ఇప్పుడు తానో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. కాలేజి నుండి బయటకు రాగానే ఉద్యోగం సిటీలో... మొదటిసారి తాను నన్ను వదిలిపోతున్న క్షణాలు. ఆ క్షణాలు తలచుకుంటే ఇప్పుడు కళ్ళు తడుస్తాయి. ఇన్ని సంవత్సరాలు ఒక్క రోజు కూడా తాను నాకు దూరంగా లేదు. తన భవిష్యత్తు మరింత సుందరంగా వుండాలంటే తాను సిటీకి వెళ్లాలి.

నేనే పంపాలి. నేనేడవకుండా తనను ఏడ్పించకుండా ధైర్యంగా పంపాలి.

నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ తనకన్ని సదుపాయాలు కల్పించి రిటర్న్ అయిన రోజు. నా దేహం నాకే బరువుగా, మనసంతా ఖాళీగా మనసు ఖాళీ ఐతే దేహం బరువౌతుందా ఏమిటో అంతా ఖాళీ తనం.

ఖాళీగా వున్న ఆలోచనలు, ఖాళీగా వున్న ఇల్లు.

ఎప్పుడు కూనిరాగాలు తీస్తూ ఇల్లంతా తిరిగే నా ఇందు లేక ఇల్లు మౌనముద్రలో ఉన్న బుద్ధారామంలా నిర్లిప్తపు నిలువుటద్దంలా.

ఒక్కసారి ఇంతెత్తున వెలిగి వెలుగులు విరజిమ్మి హటాత్తుగా ఆగిన చిచ్చుబుడ్డి మల్లె నా ఇల్లు.

ప్రతి వీకెండ్‌లో తాను రావడం, సినిమాలు షికార్లు అంతా మామూలే తను లేని ఆ వారంలో 5 రోజులూ ఓ యుగంలా, తానున్న ఆ రెండు రోజులు రెండు క్షణాల్లాగా గడుస్తోంది.

మొన్నా మధ్య కొలిగ్ అంది 'మీ అమ్మాయికి మ్యాచెస్ చూస్తున్నారా?' అని

ఒక్కసారి గుండె వేగం పెరిగింది.

ఔను కదా! నేనింకా ఆ ఆలోచనలోనే తను షి ఈజ్ 22 నా.

కచ్చితంగా ఆలోచించాల్సిందేగా పెళ్లి గురించి 'ఔను...' అనుకుంటూ "ఇంకా లేదు చూస్తాములే" అన్నాను. ఆ మాట అన్నాక పెళ్ళి... ఇందూకు పెళ్ళి.. సంబంధాలు చూడాలి అన్న ఆలోచన నా మనసంతా పాకింది. ఆ ఆలోచన రాగానే తానింక నాకు పూర్తిగా దూరమవుతుందన్న భావన నన్ను బలహీనపరచింది. సరే ఏదైనా తప్పదుగా అనుకుంటున్నా. మొన్నీ మధ్య ఒకరోజు ఎవరో ఫోన్ చేశారు.

మీ అమ్మాయికి మ్యాచ్ చూస్తారా? మా దగ్గర అబ్బాయిల వివరాలున్నాయంటూ. సరే .. ఓ సారి ఇంటికి రమ్మన్నా. ఇందూ డిటైల్స్ ప్రింట్ తీసి, ఫోటో కాపీస్ చేయించి పెట్టాను. 60+ఏజ్‌లో వున్న ఒక జంట ఇంటికొచ్చారు. తాము పెళ్ళి పెత్తనాలు

చేస్తామని, అమ్మాయి చక్కగా వుంది సంబంధాలు చూస్తామని చెప్పి డీటైల్స్ తీసుకెళ్లారు. రెండు నెలలైనా కాలేదు. నిన్న ఓ సంబంధముందని డీటైల్స్ మెయిల్ చేస్తూ నా నంబర్ అమ్మాయి డీటైల్స్ వాళ్ళకిచ్చామని చెప్పారు.

ఇక ఇప్పుడు వాళ్లు అమ్మాయిని చూడ్డానికి వస్తారట. నాకు పెళ్లి చూపులప్పుడు అమ్మ ఎంత కంగారు పడ్డదో తెలియదు కానీ నాకొకటే కంగారుగా ఉంది. మనసు వేగాన్ని, ఆలోచనలు అందుకోలేక, ఆలోచనల వేగాన్ని మనసందుకోలేక చాలా చాలా కంగారుగా, కంగాళీగా నేనున్నా..

ఉత్సాహమో, ఆత్రమో తెలీదు కానీ సర్దడం తరువాత అరేంజ్‌మెంట్స్ అన్నీ సజావుగానే చేస్తున్నా తెలియని మానసిక అలజడి.

ఇందుకిది మొదటి పరీక్ష. తానెలా ఫీల్ అవుతుందో... చెప్పలేదు. ముందే తనకు వచ్చాక చెప్పాలి అనుకుంటూ పనులు చక్కబెడుతున్నా. అంతలో ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దం...

అమ్మ నేనొచ్చేశా అంటూ పరుగెత్తుకుంటూ ఇందూ లోపలకొచ్చి నన్ను హత్తుకుంది.

తన ఆలింగనంలో నేను పొందేది అనిర్వచనీయమైన ఆనందం సంతృప్తి..

నుదుటిపై ఓ ముద్దు పెట్టుకొన్నా కాస్తంత రిలాక్స్ అయ్యాక చెప్పా..

"ఇందూ! ఈవాళ పెళ్ళివారొస్తారు. నిన్ను చూసుకోవడానికి" అని.

"ఏంటమ్మా.. ఇప్పుడు ఇవన్నీ మరో 2 ఇయర్స్ తరువాత చూద్దాంలే. నేను కొంచెం జాబ్‌లో సెటిల్ అవ్వాలి కదా!" అంది. "తరువాతైనా చేసుకోవాల్సిందేగా. చూడు నీకు నచ్చితేనే ఏదైనా.. చూపులతోనే ఏమీ జరుగదు. ముందు వాళ్ళకు మనం, మనకు వాళ్ళు నచ్చాలి. ఆ తరువాత మాటలు... ఓ అబ్బో.. చాలా తతంగమే వుంది. జస్ట్ ఇవాళ నీకిష్టమొచ్చిన డ్రస్సుతో వాళ్ళ ముందు ఒక్క రెండు నిముషాలు కూర్చో చాలు"

అన్నా.. కన్విన్స్ అయినట్లుంది.

సరిలే అంటూ వాళ్ల నాన్నతో కబుర్లలో పడ్డది. మెయిల్స్ చెక్ చేసుకుంటూ, కొత్త యుట్యూబ్ వీడియోస్ వాళ్ల నాన్నకు చూపిస్తూ... తన లోకంలో తాను.

పెళ్లివారొచ్చే టైమ్ దగ్గరపడే కొద్దీ నాలో ఆత్రం పెరుగుతోంది. ఇది తన తొలి పరీక్ష అనుకున్నా. నా పెళ్లి చూపులు గుర్తొచ్చాయి.

ఏళ్ళు గడిచినా ఈ సంప్రదాయం ఇంతేనా.. అపుడు మరీ దారుణం నీ పాదాలు చూపించు చేతులు, గోళ్ళు చూపించు అని డాక్టర్స్ అడిగినట్లు అడిగేవారు.

ఏదీ కాస్త అటు ఇటు నడువమ్మ.. అన్న వాళ్ళు ఉన్నారు.

ఇప్పుడు నా ఇందు.. వాళ్ళేమడుగుతారో..

నేనలాంటివన్నీ నా కూతురు దగ్గరకు రానీవను జస్ట్ అందరితో బాటు సోఫాలో కూర్చుని క్యాజువల్‌గా మాట్లాడించేలా చేస్తాను.

గడియారం 4 కొట్టింది. బిలబిలమంటూ 8 మంది ఇంటి ముంగిట్లో.. నమస్కారాలు పరిచయాలు చేసుకుంటూ అందరూ లోపలికొచ్చి కూర్చున్నారు. అబ్బాయి రాలేదు. వాళ్ళ అమ్మానాన్నా, తమ్ముడు మిగిలిన బంధువులు.. బాగా కలుపుగోలుగా మాట్లాడుతున్నారు.

స్వీట్స్ తినేసి టీ తాగేశారు కూడా.. అయ్యాక అమ్మాయిని పిలవండి అందో పెద్దావిడ.

సరే అంటూ "ఇందూ".. ఇలారా అన్నా నెమ్మదిగా.

చక్కటి లెమన్ ఎల్లో కాటన్ చుడిదార్ నిండుగా చున్నీ... చిన్న జడ చెవుల్లో కనిపించి కనిపించనట్లుండే చిన్న కమ్మలు, మెళ్ళో ఓ బంగారు గొలుసు ఓ చేతికి వాచి, మరో చేతిలో ఒక బంగారు గాజు..

చాలా సింపుల్‌గా ఇందూ వచ్చి అందరికీ నమస్కారం చెప్పి సోఫాలో కూర్చుంది.

ఒక్కసారిగా అందరి చూపులు ఇందూ మీద. నాకే ఎంబరాజింగ్‌గా అన్పిస్తోంది. తనకెలా వుందో ఒకావిడ పేరేంటమ్మ అంది.

'ఇందిర'..సిటీలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రాసస్ ఇంజనీర్‌గా వర్క్ చేస్తున్నాను... అంది చాలా నెమ్మదిగా. ఆవిడ నా వైపు చూసి అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళండి అంది.

అమ్మయ్య తనకు టెస్ట్ అయిపోయింది అనుకుంటూ లోపలికెళ్లమన్నా ఇందూను.

అంతే కాసేపటికి అందరూ వెళ్ళారు. ఓ వారం గడిచింది. వాళ్ళ నుండి ఎలాంటి స్పందనా లేదు.

వాళ్ళబ్బాయి ఫోటో డీటైల్స్ నాకూ, ఆయనకు బాగానే అన్పించాయి. ఇక వాళ్ళ నుండి పాజిటివ్ రెస్పాన్స్ రాలేదు.

ఈవాళ నాకెందుకో వాళ్ల రెస్పాన్స్ ఏంటో కనుక్కోవాలని చాలా యాంగ్జైటీగా ఉంది.

అయినా నచ్చకపోవడానికి ఏం లోపం వుందని నా ఇందూలో.. అందమైన అమ్మాయి.

మంచి ఉద్యోగం.. ఓ సారి అడుగుదామనుకున్నా అన్పించడమే తడవుగా పెళ్లి సంబంధం తెచ్చిన వాళ్ళకు కాల్ చేశా.

మీరు చెప్పిన సంబంధం వాళ్ళు అమ్మాయిని చూసెళ్లారండి.

మళ్ళీ రెస్పాన్స్ లేదు ఏంటట అన్నా చాలా క్యాజువల్‌గా. ఓహ్ మీరా అమ్మ..

అదా.. వాళ్ళకు అమ్మాయి నచ్చిందట కానీ కానీ.. నసిగాడాయన.

పర్లేదయ్యా చెప్పు.. అన్నా

అమ్మాయి లావుగా వుందన్నారమ్మ.. అన్నాడతను.

ఒక్కసారిగా వినకూడనిదేదో విన్నట్టు..

హఠాత్పరిణామాన్ని తట్టుకోలేకపోయా..

ఐతే ఏంటట అన్నా రోషంగా.. అంతేనమ్మ లావుగా వుంది...అమ్మాయి. మిగతా అంతా ఓకె అన్నారమ్మ అంటూ పెట్టేశాడాయన.

ఏం...అమ్మాయి లావుగా వుండరాదా..

అది దాని ఫిజిక్ అంతేగా

ఆహా.. ఏంటది.. నో..

తాను 9వ తరగతి చదివేప్పుడోసారి నన్ను డ్రాప్ చెయ్యడానికి బస్‌స్టాండుకు వచ్చింది.. నా కొలిగ్ స్టాప్‌లో వుంది.

వావ్.. నీ కూతురా అంది

ఔనన్నా.. ఏ క్లాస్.. 9వ తరగత అవునా..

నువ్వు నెయ్యి తగ్గించి పెట్టు..

నెయ్యి పోస్తున్నట్టున్నావ్.. కాస్త లావుగా ఉంది అమ్మాయి అంది తను,

నాకు కోపం నశాళానికి.. వుంటే వుంది.

తానంతే.. వాళ్ళ మేనత్తల పోలిక తానలాగే వుండనీ..

తిండి తగ్గించి నీరసించి పని చేసుకోలేక

పీల పీలగా వయ్యారాలు పోక్కర్లేదు అన్నా ఉడుక్కుంటూ..

తరువాత తాను ఇంటర్‌లో వున్నప్పుడు డిగ్రీలో వున్నప్పుడు తన ఫ్రెండ్స్ ఇంటికొచ్చేవాళ్లు బక్కగా, పీలగా, కట్టెపుల్లలాగా..

వాళ్ల మధ్య నా ఇందు నిండుగా అందంగా నాకు కన్పించేది.

ఇప్పుడు వాళ్ళెవరట నా కూతురు లావుగా వుందని అంటారా..

చాలా కోపంగా ఉంది. ఉక్రోషంగా ఉంది. చడామడా తిట్టేయాలనుంది

నా కూతురు.. నా ఇందు..ఒక్క లావుగా ఉండటం కారణంగా రిజక్ట్ చేయడం తట్టుకోలేకపోతున్నా,

ఏం...ఎందుకూ.. అనుకోవడం

ప్రపంచంలో అందరూ ఒకే సైజులో వుంటారా ఏంటి

అసలెవరు నిర్ణయిస్తారీ కొలతల్ని

ఆలోచనలకు, అభిప్రాయాలకు, ఆత్మీయతలకు, అభిమానాలకు, ముఖ్యంగా ఆదాయానికి,

సంతోషాలకు, సంబరాలకు దేనికీ రేషన్ లేదు

జీవితంలో మరి అమ్మాయి బరువే భారమా! తగ్గించాల్సిన బరువు భారమై గుండెలపైకెక్కి కూర్చుంది ఊపిరాడ్డం లేదు.

అసలు ఊపిరాడ్డం లేదు. హఠాత్తుగా ఆ మాటను వినడం తట్టుకోలేకున్నా ఫ్రిజ్ ఓపన్ చేసి చల్లనీళ్ళు తీసి గటాగటా తాగేశా.. ఆహా.. లేదు.. నా మనసు ఒప్పుకోవడం లేదు.

నా ఇందూను కాస్తంత వెయిట్ తగ్గమని చెప్పడం నావల్ల కాదు.

నావల్ల కాదు అయినా ఎందుకు తగ్గాలి. తానలాగే వుండాలి.

ముద్దుగా బొద్దుగా హాయిగా నవ్వుతూ..

తనకసలు చెప్పను వాళ్ళ ఆలోచనను

అనుకుంటున్నా కానీ మనసంతా కంగారుగా ఉంది

కాస్త బొద్దుగా వుండడమే నేరమా...

అసలు అమ్మాయిలు ఇలా కొలతలలో వుండాలని ఈ సమాజానికి ఎవరు చెప్పారు.

అమ్మాయి అనగానే కొలతలతో బంధింపబడాల్నా ఆ కొలతలకు తాను తూగలేనని ఆత్మ న్యూనతతో బాధపడాల్నా.

మొహంమీద మొటిమలున్నాయని,

నల్లగా వున్నావని, జుట్టు పెద్దగా లేదని,

కొలతలకు సరిపడా లేనని

వెయిట్ తక్కువగా వున్నానని కొందరు,

ఎక్కువగా వున్నావని కొందరు చాలామటుకు అమ్మాయిలు ఆత్మన్యూనతతో ఉంటున్నారు.

నో నా ఇందూ అలా ఫీల్ కాకూడదు.

అందం పెంచుకోవడానికి పసుపుపాలు మొహానికి పూసుకోవడం.

రకరకాల క్రీములు, రకరకాల షాంపులు వాడి వీటి నుండి తమకు అందం రావాలనుకోవడం ఎంత మూర్ఖత్వం కదా.

చక్కగా పౌష్ఠికాహారం తీసుకుంటూ చాలినంత శారీరక శ్రమ చేస్తే చాలుగా.

కొలతలకు అనువుగా వుండాలని ఉపవాసాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోలేక, హాయిగా తినలేక, నిద్రరాక జీవితంలో వీళ్ళేం సాధిస్తారిక. వేసుకున్న మేకప్ చెడిపోతుందనో, గాలికి హెయిర్ స్టైల్ చెడిపోతుందని స్కార్ఫ్‌లు కట్టుకొని ఎండతగలకుండా డి విటమిన్ లేకుండా బ్రతికేసి పీలగా అవుతున్నారు అమ్మాయిలు.

అందుకే నేనెప్పుడు ఇందూకు అలాంటి ఆలోచనను రానివ్వలేదు.

ఆత్మవిశ్వాసమే అందం,

కార్యసాధనా సామర్థ్యమే అందం,

ఆరోగ్యమే అందం,

చిరునవ్వే అందం,

కలుపుగోలుతనమే అందం,

భావప్రకటనే అందం,

అంతేగాని కొలతలకు అనువుగా వుండడం అందం కాదని ఎలా చెప్పాలి. పెళ్ళి సంబంధం వాళ్ళకు ఫోన్ చేసి ఇదంతా చెప్పాలనుకున్నా! వాళ్ళ ఆలోచన తప్పని.

అమ్మాయి బరువు భారం కాదని.

అది పెరుగుతున్న వాళ్ళ పరువని,

బాంధవ్యాలను పంచుకోవడానికి బరువే సమస్యకాదని చెప్పాలనిపించింది.

కానీ ఏమీ చెప్పకుండా మౌనంగా వున్నా! నేనేం మాట్లాడినా నా ఇందు వ్యక్తిత్వం దెబ్బతింటుందని, తన సామర్థ్యాలను గురించి చెప్పి వాళ్ళను ఒప్పించాలని అన్పించలేదు.

నా బంగారు తల్లిని పొందే అదృష్టం వాళ్ళకే లేదులే అనుకున్నా..

ఓ వారం గడిచిందనుకుంటా..మళ్ళీ ఆవిడే ఫోన్...

ఏమండీ మీ అమ్మాయి చూడటానికి మా అబ్బాయి వస్తానంటున్నాడు ఎప్పుడు చూడొచ్చు అంది. ఎందుకు లేండి మళ్ళీ చూపులు మా అమ్మాయి లావుందిగా అన్నా అక్కసుగా నా కోపం ఇంకా చల్లారలేదు. లేదండీ మేమలా అనలేదే. మా బంధువులు అలా అనుకొన్నారేమో నేను నా పిల్లలు అలాంటి ఆలోచనలోనే లేము. ఒక్కసారి అబ్బాయిని చూడనివ్వండి.

తరువాత పిల్లలిష్టం అందావిడ.

వాళ్ళకు క్లాసు తీసుకోవడానికి వ్యక్తిత్వం గురించి చెప్పడానికి ఓ మంచి అవకాశం అనుకొని అమ్మాయిని అడిగి చెప్తా అన్నా వీకెండ్‌లో వచ్చింది ఇందు...

ఇందూ.. నీతో ఓ విషయం చెప్పనా ఏంటమ్మ నా పర్మిషన్ అవసరమా.. చెప్పమ్మ అంది ఇందూ... మొన్నామధ్య వచ్చిన పెళ్ళి సంబంధం వాళ్ల మళ్ళీ వస్తారట అన్నా.

ఎందుకు? అంది. అబ్బాయి నిన్ను చూళ్లేదుగా, చూస్తాడట అన్నా.

అమ్మ..ఇవన్నీ ఏంటి ఒక టు ఇయర్స్ వద్దన్నా కదా! ఇపుడెవరితోనూ నే మాట్లాడనుపో అంది.

అలాకాదురా! ఓ సారి మాట్లాడి చూడు. ఏదైనా నీకు నచ్చితేనేగా చేస్తాను.

ప్రయత్నం చేయకుండా వద్దనడం భావ్యం కాదుకదా అన్నా సరేలే.. రేపు సండేగా ఉదయం రమ్మను అంది చాలా క్యాజువల్‌గా అదే విషయం ఫోన్ చేసి ఆవిడకు చెప్పా. అబ్బాయితో బాటు రేపు 10 గంటలకు రమ్మని ఉదయం 10.. తల్లీకొడుకులిద్దరూ బైక్‌లో వచ్చి ఇంటి ముందు ఆగారు.

మొదటిసారి అబ్బాయిని నే చూశా.

బాగున్నాడే అనిపించింది. ఫోటోలో కంటే నిజంగానే బాగున్నాడు.

కాస్తంత తృప్తిగా అనిపించింది.

రండి కూర్చోండి అని చెప్పి పాలు కలిపిచ్చా.

తాగేసి కూర్చున్నారిద్దరు.

అబ్బాయి అన్నాడు...

ఆంటీ.. నేను మీ అమ్మాయితో మాట్లాడొచ్చా అని ష్యూర్‌గా అంటూ పిలిచా

ఇందూ..రా ఇలా అని.. ఎప్పుడూ ఉల్లాసంగా ఉండే ఇందు కాస్త మొహం చిన్న బుచ్చుకొని హాల్‌లోకి వచ్చింది.

బహుశా వాళ్ళ నాన్న చెప్పారేమో నీవు లావుగా ఉన్నావని వాళ్ళన్నారని.

'ఛ' ఈయనకెప్పటికీ సరైన ఆలోచన లేదు. రాదు కూడా. ఎప్పుడెవరికి ఏం చెప్పాలో తెలీదు అనుకున్నా మనసులో...

ఇందు రాగానే ఆ అబ్బాయి లేచి నిలబడి

నమస్తే...నా పేరు చంద్రశేఖర్ అందరూ చందూ అంటారు అన్నాడు.

ఇందు ప్రతి నమస్కారం చేసి ఎదురుగా కూర్చుంది.

కాసేపు ప్రొఫెషనల్‌గా మాట్లాడారు. తరువాత తానే అంది మేమిద్దరం కాస్త మాట్లాడుకుంటాం అని మేడమీద గదివైపు కెళ్ళమన్నా. అభిప్రాయాలు, ఆలోచనలు, ప్రణాళికలు, ప్రయోజనాలు,

బంధాలు, అనుబంధాలు,

జీతాలు, జీవితాలు

అన్నింటి గురించి చర్చ తర్వాత ఇద్దరూ కిందకొచ్చారు.

ఇందు మొహంలో ఓ సరికొత్త నవ్వు

ఎప్పుడూ లేనిది బుగ్గలు సిగ్గుల మొగ్గలయ్యాయి.

కళ్ళు సంతోషంతో మెరుస్తున్నాయి.

తననే చూస్తున్న నావైపు చూసి తనకిష్టమే అన్నట్టు తలూపుతూ లోపలికెళ్ళింది.

సోఫాలో కూర్చున్న చందూ చెప్పాడిలా సారీ ఆంటీ.. ఫిజికల్ ఫీచర్స్ గురించి మావాళ్ళన్నారని మీరు బాధపడ్డారట ఐ యామ్ సారీ ఫర్ దట్ నేనా అభిప్రాయంలో లేను. కానీ బంధాన్ని కలుపుకోవడానికి, నిలుపుకోవడానికి అమ్మాయి కొలతలు కాదు కావాల్సింది.

అందరూ ఆమోదించే విలువలు.

ఆ విలువల కోసమే నేనొచ్చాను.

ఎవరూ ఎప్పుడూ ఒకే వెయిట్‌తో వుండరు.

వుండలేరు.

నథింగ్ ఈజ్ పర్మనెంట్ చేంజ్ ఈజ్ ఎటరన్నల్ ఇందూ ఆలోచనలు, అభిప్రాయాలు,

చర్చించే విధానం

విషయాన్ని అవగాహన చేసుకునే తీరు,

బంధాలకు స్పందించే ఆ మనస్తత్వం నాకు నచ్చాయి.

అందం రంగులోనూ,

అమ్మాయిల కొలతలలోను కాదుగా వుండేది.

అది ఆత్మ సౌందర్యంతో బాటు వచ్చేది.

మానవ విలువల్ని పంచడానికి,

ఆత్మీయతల్ని, కుటుంబంలో నింపడానికి అవగాహన కల్గిన మనసున్న భార్య నాకు కావాలి.

ఇందిర నాకు అలాంటి భార్య కాగల్గుతుందని నమ్ముతున్నా.. మా అమ్మనాన్నలకు,

తనకు,

మీ ఇంట్లో అందరికీ నచ్చితే నేను తనను పెళ్ళి చేసుకుంటానన్నాడు.

అంతవరకు నా మనసులో గూడు కట్టుకున్న అనుమానపు తెర వీడిపోయింది.

చందు మాటల్నీ తదేకంగా వింటున్న ఇందు వైపు ఒకసారి చూసా...తన కళ్ళల్లో కొత్త మెరుపు

అంతెత్తుల్లో ఉన్న ఆకాశం అమాంతంగా అంతరంగంలోకి వంగి దోసిళ్ళతో నక్షత్రాలను జారవిడిచినట్టు

చెలమతో స్వచ్ఛంగా ఉబికే నీరు జలపాతమై ప్రవహించినట్టు ముసుగేసుకున్న మబ్బు ఒక్కసారిగా వానజల్లై తడిపేసినట్టున్న ఇందు నవ్వు నా ఎదసవ్వడితో కలిసి నాలో వేయి వీణలు మోగాయి.

✦

సజీవ సమకాలీన ఉదంతాలు



సింగరాజు లింగమూర్తి రచనలు.. కథలు
పేజీలు : 270
ధర : 175/-
లభించుచోటు : నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన బుక్‌హౌస్
ప్రజాశక్తి బుక్‌హౌస్
నవతెలంగాణా బుక్‌హౌస్

'సింగరాజు లింగమూర్తి కథల రెండో సంపుటిలో 26 కథలున్నాయి. నలభై- ఏభై ఏళ్ల క్రితం రచించిన ఈ కథల్ని చదువుతుంటే వీటికి కాలం చెల్లిపోతుందన్న అభిప్రాయం కలగదు. ఈనాటికీ ఈ కథలు సజీవంగా సమకాలీన సమస్యల్ని చిత్రిస్తున్నట్లుగానే ఉండడం ఆశ్చర్యపరుస్తుందనే చెప్పాలి. దాదాపు అన్ని కథలు మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే ఉదంతాలకు సంబంధించినవే కాగా ఎక్కువ కథలు విషాదాంతాలుగానే ముగిశాయి. ఈ సంపుటిలో తొలి కథ 'మృత్యువు నవ్విన రాత్రి'లో ప్రకాశం అనే ఉపాధ్యాయుడు తనకు సాయం చేసిన పార్వతమ్మ భర్త కోసం మందులు తేవడానికి జోరున కురుస్తున్న వర్షంలో తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి సైకిల్ మీద పట్టణానికెళ్లి మందులు తెచ్చి ఇస్తాడు. పార్వతమ్మ భర్త ప్రాణాలైతే కాపాడగలిగాడు గాని తడిసి ముద్దయిన ప్రకాశం మాత్రం ప్రాణాలు కోల్పోవడం విషాదాన్ని నింపింది. 'కలవని పాయలు' అనే కథలో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు రాజకీయ ప్రత్యర్థులు వర్షం కారణంగా బస్సు దిగి రోడ్డు పక్కన గల టీ పాకలో కలుసుకుంటారు.- పాత కక్షలను పక్కన పెట్టి గ్రామాభివృద్ధి కోసం కలిసుందామని నిర్ణయించుకుంటారు. అయితే వాళ్లిద్దరూ ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్లు వేస్తారు. ఊబిలోకి, రాజకీయాల్లోకి దిగిన వారు వాటి నుంచి బయటకు రాలేరని వీరి ఉదంతం తెలియజేస్తుంది. 'రాలిన క్షణాలు' కథలో ఇద్దరు స్త్రీపురుషులు చనువుగా తిరగ్గానే వారి మధ్య ఏదో అక్రమ సంబంధం ఉందని చెవులు కొరుక్కోవడం వంటి పుకార్లు ఎంతటికి దారితీస్తాయో రచయిత ఈ కథలో చిత్రించారు. 'ఆమె నేర్చిన తీరు' కథలో ఒక ఆఫీసులో పని చేస్తున్న యువతి పట్ల ఆ ఆఫీసులో పనిచేస్తున్న పురుషుల దృష్టి కోణం ఎలా ఉంటుందో వివరిం చారు. 'మోగని గంటలు' కథలో ఒక గ్రామంలో గోవిందాచారి, వెంకటపతి అనే ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వైరం నేపథ్యంలో పోటాపోటీగా గ్రామాభివృద్ధి పనులు జరగడం, తక్కావి రుణాలు రాకుండా వెంకటపతి అడ్డుకోవడం, ఇది తెలిసి మంత్రులు గ్రామాన్ని సందర్శించి సహకరించడాన్ని రచయిత ఆసక్తిగా మలిచారు. 'భిన్నత్వంలో ఏకత్వం' కథలో తాగుడుకు బానిసైన ఓ రచయితను ప్రేమించిన మరో రచయిత్రి ఆ తాగుడును మాన్పించి అతన్ని తన వాడిగా చేసుకోవడం వయసుపైబడిన యువతి స్వభావాన్ని తెలియజేస్తుంది. 'జానకి' కథలో పిల్లలు లేకపోవడంతో అన్న కొడుకును పెంచుకోగా ఆ తర్వాత ఆమెకు కొడుకు పుడతాడు. పెంచుకున్న కొడుకును మునుపటిలా చూడరేమోనని వారి బంధువుల అనుమానాన్ని తప్పు అని రుజువు చేయడం ఆసక్తిని కలిగించేలా రాశారు. 'తిరిగి వచ్చిన మనిషి' కథలో దొంగతనం చేసి జైలుకెళ్లిన రఘు విడుదలై ఇంటికొస్తాడు. భార్య అతన్ని ప్రేమగానే ఆహ్వానించినా రఘు కొడుకు అతన్ని గుర్తు పట్టడు. తను దొంగ అని కొడుకుకు తెలియకూడదనుకున్న రఘు ఇంటి నుంచి వెళ్లిపోవడాన్ని హృద్యంగా రచయిత మలిచారు. ఇలా ఈ సంపుటిలోని కథలన్నింటిలో మనుషుల మనస్తత్వానికి సంబంధించిన భిన్నపార్శ్వాల చిత్రణ ఉంది. మరుగున పడిపోయిన సింగరాజు లింగమూర్తి కథల్ని పునర్ముద్రించి ఈనాటి పాఠకులకు అందుబాటులోకి తేవడం అభినందించదగిన విషయం. **- టి.డి.ప్రసాద్**

వర్తమాన సమాజాన్ని ఆవిష్కరించిన కథలు



-కొన్ని వెలుగునీడలు
రచన: డా.వెన్నం ఉపేందర్
పేజీలు: 270
వెల:130/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, నవ తెలంగాణ బుక్ హౌస్, నవచేతన పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ
హైదరాబాద్-068
ఫోన్ : 24224453

ఖండాంతరాలకీ గంటల్లో ప్రయాణం చేస్తున్నాడు మనిషి. ఇంత పురోగమనాన్ని సాధించినా మనిషి కొన్ని కొన్ని సందర్భాల్లో మానవత్వాన్నే మరచిపోతున్నాడు. ముసలి తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాల్లో చేర్చే తరం పుట్టింది. పొలాలను ప్లాట్లుగా విభజించి వ్యాపారం చేసే వారు బయల్దేరారు. ప్రపంచీకరణ, సరళీకరణ వలన దేశంలో, గ్రామంలో అనేక మార్పులు వచ్చాయి. కులవృత్తులు నశించాయి. హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, చిందుభాగవతం ఈ కళలన్నీ అంతరించి పోయాయి. మనిషి పచ్చనోట్ల పరిష్వంగంలో మైమరచి పోతున్నాడు. అన్ని రంగాల్లో దోపిడీ కొనసాగుతూనేవుంది. వీటన్నిటినీ కళ్లముందు ఆవిష్కరించిన కథలే 'కొన్ని వెలుగు-నీడలు'. 'జారిపోయిన నేను' రజాకార్ల ఉద్యమంలో పోరాడిన ఒక యోధుని అంతరంగ కథనం. ఈ కథలో అతని ఘోష సాక్షాత్కరిస్తుంది. ఇప్పటికైనా స్వాతంత్ర్య సమరయోధుల ఫించన్ వస్తుందా? అని అడుగుతాడు. చెరువులు లేవు. బోర్లు వచ్చాయి. దోపిడి రూపం మార్చుకుంది. నిత్యం కొనుక్కొనే పప్పు, బియ్యంలానే నీళ్లు కూడా కొనుక్కోవాల్సి వచ్చింది. ఇది సంక్లిష్ట వ్యవస్థ అని ప్రశ్నించడం మరచిపోనంత వరకు ఉభయకుశలోపరే" అంటాడు. ఆధునిక మానవుడు సెల్‌కి ఎలా బానిసలయింది విప్పిచెప్పే కథ 'నెట్‌వర్క్ ఫెయిల్యూర్'. కొడుకు సెల్ పంపించిన దగ్గర నుంచి సెల్‌కు బానిసవుతుంది కనకం. రైలు ప్రయాణంలో వేరే రాష్ట్రంలోకి ప్రవేశించాక, సిగ్నల్ అందక భర్త, పిల్లలతో మాట్లాడడంలో వున్న ఆనందం తెలుసుకొని సెల్ వ్యామోహానికి స్వస్తి చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆనందించిన వృత్తాంతం. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాక కుటుంబమంటే భార్యాభర్త పిల్లలే అయిన చోట నేటి పిల్లలకు ఇంటికి తాతయ్య, అమ్మమ్మ ఎవరొచ్చినా వారిపొడ గిట్టని విధానాన్ని 'అంతరాలు' కథలో విప్పి చెప్తారు. 12 ఏళ్ల మనవడికి తాత తన గదిలో వుండడం ఇష్టంలేదు. తాతామనవడి మధ్య కొడుకు సారధ్యం ఫలించి వాళ్ల మధ్య మళ్లీ స్నేహం చిగురించడంతో కథ ముగుస్తుంది. సరళీకరణ, ప్రపంచీకరణ వలన పల్లెలు ఎలా మారిపోయాయో, వాటి సహజ స్వభావాన్ని ఎలా కోల్పోయాయో తెలి యజెప్పే కథ 'కొత్తగాలి'. ఈ కథలో మానవ పాత్ర లేవీ వుండవు. గాలిని పల్లెకి పట్టణానికి ప్రతీకగా చేసుకొని కొత్త శిల్పంతో కథ నడిపిన తీరు అలరిస్తుంది.

ఆధునిక మానవ జీవనంలో మట్టి పాత్రలకు స్థానం లేకుండా పోవడం క్రమక్రమంగా కుమ్మరి వాళ్ల కులవృత్తి అంతరించడం 'మట్టి మనిషి' కథ. 'ఉత్తరం', ఆసుపత్రి గాయం', 'పాతిక కుటుంబాలు', జంటపావురాలు', 'ఉగ్గుగిన్నెలో', 'ఏడు రంగులు', 'చెత్తోడు' కథలు పాఠకుల హృదయాలను ప్రభావితం చేస్తాయి. ఈ సంపుటిలోని కథలన్నీ వర్తమాన సమాజపు సంక్లిష్ట జీవితానికి అద్దం పట్టేవే. బడుగు వర్గాలకొక న్యాయం, బడా బాబులకొక న్యాయం వర్తించే నాటి దుర్మార్గ వ్యవస్థను ప్రతిబింబిస్తూ ఆలోచనలను రేకెత్తించే కథలివి. ఎన్నో పురస్కారాలందుకొని కవిగా కథకులుగా లబ్ధ ప్రతిష్ఠులైన డా.వెన్నం ఉపేందర్ గారు మరెన్నో కథలు రాసి తెలుగు వారిని ఆనందింప చేస్తారని ఆశిస్తున్నాను.

మందరపు హైమవతి



ఓ ధనవంతుడి ఇంట్లో కూతిరి పెళ్లి కుదిరితే.. ఆకాశమంత పందిళ్లు, వేలాదిగా బంధువులు, విడిదిళ్లుగా మారే స్టార్ హోటళ్లు, వందల రకాల వంట కాలు, కాస్ట్యూమ్ డిజైనర్లు, ఈవెంట్ మేనేజర్లు ఇలా పెళ్లి వేడుకలు మొదలైనప్పటి నుంచి ఆ తంతు ముగిసే వరకూ ఖర్చంతా లక్షలు, కోట్లలోనే వుంటుంది. ఈ మధ్య అలాంటి ఓ పెళ్లి గురించి వార్తలే వార్తలు. డబ్బంతా వృథా అయిపో తోందేనన్న బాధ కొందరిదైతే.. అస్సలు అంత డబ్బుతో పెళ్లి చేయొచ్చా అనే ప్రశ్నతో నిద్రలేని సామాన్యులు మరికొందరు. వీళ్లు కాస్త సంతోషించేలా మరో ధనవంతుడి ఇంట ఓ పెళ్లి జరిగింది. కళ్యాణ కానుకగా పేదోడి ఇంటి కలను నెరవేర్చాడు. వృథా ఖర్చులన్నిటినీ తగ్గించుకుని ఆ డబ్బు మొత్తాన్నీ ఓ మంచి పనికి వినియోగించాడు ఔరంగాబాద్‌కి చెందిన అజయ్ మునోత్.

ఓ పెళ్లి.. 90 ఇళ్లు

రాజుల కాలం నాటి రాకుమారుల కళ్యాణ వైభోగాలూ చిన్నబుచ్చుకునేలా ఉంటున్నాయి ఈ మధ్య బడా పెళ్లిళ్లు. అహ్మదాబాద్ వ్యాపారి కూతురి పెళ్లి కూడా ఇలానే జరుగుతుందని తెలిసినోళ్లంతా అనుకున్నారు. కానీ వారందరే కాదు దేశం మొత్తం చెప్పుకునేలా కూతురి పెళ్లి సందర్భంగా పేదోళ్లకు 90 ఇళ్లు కట్టించి బహుమానంగా ఇచ్చాడు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కి చెందిన అజయ్ మునోత్ ఒక సంపన్న కుటుంబానికి చెందిన వాడు. ఔరంగాబాద్ జిల్లాలోని లాసర్ ప్రాంతంలో దుస్తులు, గోధుమల హోల్‌సేల్ వ్యాపారంలో కొనసాగుతు న్నాడు. తాను అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు శ్రేయా వివాహం ఈ మధ్యే ఖాయమవడంతో ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. పెళ్లి ముహూర్తం కూడా దగ్గర పడుతుండటంతో తన తాహతకు తగట్టు ఘనంగా కూతురి పెళ్లిని జరిపించాలనుకున్నారు కుటుంబసభ్యులు. పెళ్లి వేదిక అలంకరణలు, విందు-వినోదాలు, అతిథుల కోసం స్టార్ హోటళ్లలో విడిది ఏర్పాట్లు, ఇతర కానుకలకు మొత్తం 70-80 లక్షల వరకు ఖర్చవుతుందని లెక్కతేలింది. ఒక్కగానొక్క కూతురి వివాహాన్ని ఇంతకంటే ఘనంగా చేయగల స్థోమత ఉన్నా కూడా ఒక్క రోజులో ఆ ఖర్చంతా వృథా అయిపోతుంది కదా అనే ఆలోచనలో పడ్డాడు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బుని ఆర్భాటాల కోసం ఖర్చు చేయడం మునోత్‌కి మంచిది కాదనిపించింది. మరో మంచి పని కోసం ఉపయోగిస్తే కూతురికి సరైన ఆశీస్సులు అందుతాయని భావించాడు. మిత్రుల సలహా తీసుకున్నాడు. పేదలకు అన్నదానం, వస్త్రదానం ఇలా రకరకాల ఆలోచనలు చేశాక చివరకు పేదింటి గూడు సమస్యపై దృష్టి పడింది. ఇల్లు కట్టిస్తే కుటుంబం సగం సెటిల్ అయినట్టే అని తోచింది. అంతే రంగంలోకి దిగిపోయాడు. తనే దగ్గరుండి ఇళ్ల నిర్మాణ ఏర్పాట్లు చూసుకున్నాడు. ఔరంగాబాద్ పరిసర ప్రాంతాల్లోని మురికివాడల్లో నివసించే పేదలకి ఇళ్లను అందిస్తానని కూతురితో చెబితే చాలా సంతోషించింది. తన భర్తను, అత్తమామలను ఒప్పించింది. వివాహానికి కొద్ది రోజుల క్రితమే ఆ ఆలోచన చేసినా అది కూతురి పెళ్లి కానుకగా అందించడం కోసం వివాహానికి ముందే ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తి చేయాలనుకు న్నాడు. పక్కా ప్లాన్‌తో రెండెకరాల్లో 180 ఇళ్లను కట్టాలనుకున్నాడు. వంట గది, హాల్, పడక గది

కలిగుండేలా(బిహెచ్‌కె) నమూనాలో 12౹20 చదరపు అడుగుల్లో నిర్మాణాలు జరిగాయి. శ్రేయ వివాహం రోజునాటికి 90 ఇళ్ల నిర్మాణం పూర్తవడంతో వాటిని పేదలకు అందించారు. కనీస సదుపాయాలు కూడా నోచుకోని ఈ ప్రాంతంలో మునోత్ అందించిన ఇళ్లతో పాటు ఇక్కడ నివసించే వారికి తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్ల వంటి సదుపాయాలని కూడా అందుకోగలిగారు. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఓ ప్రత్యేక పద్ధతిని ఎంచుకున్నాడు. ఈ కాలనీలో నివాసం ఉండేవారు పేదవారు కావడం తోపాటు తప్పనిసరిగా మురికి వాడలకి చెందినవారు కావాలి. వ్యసనాలకి బానిసలుగా ఉండకూడదు. ఈ షరతు అంగీకరించిన వారికి శ్రేయ వివాహానంతరం కొత్త జంట చేతుల మీదుగా ఇళ్లను అందించారు. ఇప్పటి వరకు 40 ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయి. మునోత్ ఆలోచన మరి కొందరిలో మార్పు తీసుకురావాలని కోరుకుందాం. ✦

రెడ్ వెల్వెట్ కేక్

కావాల్సిన పదార్థాలు

వెన్న-400గ్రాములు
ఐసింగ్ షుగర్-400గ్రాములు
మైదా-350గ్రాములు
బేకింగ్ పౌడర్-5గ్రాములు
గుడ్లు-7 టాపింగ్ కోసం:
వెన్న-400గ్రాములు
కాస్టర్ షుగర్-300గ్రాములు
గుడ్డులోని తెల్లసొన-100గ్రాములు

తయారీ విధానం:

వెడల్పాటి గిన్నెలో వెన్న ఐసింగ్ షుగర్ తీసుకొని క్రీంలా తయారయ్యేదాకా గిలకొట్టాలి. తర్వాత ఒక్కో గుడ్డు సొన వేస్తూ మరోసారి గిలక్కొట్టాలి. అంతా కలిసాక మైదా, బేకింగ్ పౌడర్ వేసి పిండి అంతా బాగా కలపాలి. ఈ పిండిని పేపరు కప్పుల్లో ముప్పావు వంతు తీసుకోవాలి. ఓవెన్‌ను ముందుగా 180 డిగ్రీల్లో వేడిచేసి ఈ కప్పులను అందులో పెట్టి పదిహేను నిమిషాలు బేక్ చేస్తే కేకులు తయారవుతాయి. మరో గిన్నెలో టాపింగ్ కోసం తీసుకున్న వెన్న, కాస్టర్‌షుగర్, గుడ్డు తెల్లసొనను బాగా కలిపి పెట్టుకోవాలి. తయారైన కేక్‌ని బయటకు తీసి చల్లారనిచ్చి టాపింగ్ మిశ్రమాన్ని దానిపై పరిచి పైన చాక్లెట్ ముక్కలు అలంకరిస్తే పసందైన రెడ్ వెల్వెట్ కేక్ సిద్ధం.

డ్రై ఫ్రూట్ కేక్

కావాల్సిన పదార్థాలు

వెన్న-పావుకేజీ
చక్కెర-125గ్రాములు
కోడిగుడ్లు- 4 మైదా-200గ్రాములు బేకింగ్ పౌడర్- అరచెంచా దాల్చిన చెక్క, లవంగాలు, యాల కుల పొడి-అరచెంచా అన్ని రకాల డ్రైఫ్రూట్స్-అరకేజీ ప్రూన్స్-100గ్రాములు(ఖర్జురాలా మాదిరి ఉంటాయి. బజార్లో దొరుకుతాయి)వాల్‌నట్లు-100గ్రాములు (ముక్కల్లా తరగాలి) ఆరెంజ్ జ్యూస్-2 టేబుల్ స్పూన్లు కమలాపండు తొక్కలపొడి-కొద్దిగా వెనిల్లా ఎసెన్స్-చెంచా.

తయారీ విధానం : ఒకరోజు ముందు గిన్నెలో డ్రైఫ్రూట్స్ పలుకులు, ప్రూన్స్ ముక్కలు బాగా కలిపి పెట్టుకోవాలి. ఓవెన్‌ని అరగంట ముందే 160 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి చేసుకోవాలి. మైదా, బేకింగ్ పౌడరు కలిపి జల్లించి పెట్టుకోవాలి. మరో గిన్నెలో వెన్న, చక్కెర తీసుకుని నురగ వచ్చేలా గిలకొట్టి దానిలోనే ఆరెంజ్ జ్యూస్, కమలాపండు తొక్కలపొడి, వెనిల్లా ఎసెన్సు కలపాలి. అందులోనే ఒక్కో గుడ్డు సొన వేసుకుంటూ మరోసారి కలపాలి. ఇందులో పావు వంతు మైదా కలిపి తర్వాత మిగిలిన పిండిని వేసి కలపాలి. మసాలా దినుసుల పొడి, డ్రైఫ్రూట్స్, వాల్‌నట్లూ వేసుకుని మరోసారి కలిపి బేకింగ్ గిన్నెలోకి తీసుకుని ఓవెన్‌లో ఉంచాలి. కనీసం నలభై నిమిషాలు బేక్ చేసి బయటకు తీస్తే డ్రై ఫ్రూట్ కేక్ రెడీ.

మెరింగ్ బ్రౌనీ కేక్

కావాల్సిన పదార్థాలు

బ్రౌనీ బేస్ కోసం : డార్క్ చాక్లెట్ తరుగు-200గ్రాములు
ఉప్పు కలపని వెన్న-200గ్రాములు
ఐసింగ్ షుగర్-250 గ్రాములు
గుడ్లు-3 మైదా-110గ్రాములు



టాపింగ్ కోసం
గుడ్లు-4(తెల్లసొన మాత్రమే తీసుకోవాలి) చక్కెర-200గ్రాములు
వేయించిన బాదంపప్పు-100గ్రాములు
క్రీం ఆఫ్ టార్టర్-కొద్దిగా(బజార్లో దొరుకుతుంది)
ఫిల్లింగ్ కోసం
గిలకొట్టిన క్రీం-300ఎం.ఎల్
ఐసింగ్ షుగర్-100గ్రాములు
స్ట్రాబెర్రీలు-200గ్రాములు
పిస్తా పలుకులు-అర కప్పు

తయారీ విధానం

ముందుగా ఓవెన్‌ని 190 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి చేసుకోవాలి. గుండ్రని కేక్ పాన్ తీసుకుని నూనె లేదా వెన్నను రాయాలి. తర్వాత బ్రౌనీ బేస్ కోసం 180 గ్రాముల చాక్లెట్‌ని ఓ గిన్నెలో తీసుకోవాలి. దాన్ని సగం వరకూ నీటిని నింపిన గిన్నెలో ఉంచి స్టౌపై పెట్టాలి. రెండు, మూడు నిమిషాల్లో చాక్లెట్ కరుగుతుంది. మిగిలిన చాక్లెట్‌ని ముక్కల్లా తరిగి పెట్టుకోవాలి. తర్వాత వెన్న, ఐసింగ్ షుగర్‌ని మరో గిన్నెలో తీసుకుని నురగ వచ్చే వరకూ గిలకొట్టాలి. దానిలో ఒక్కో గుడ్డు సొనను వేస్తూ, తర్వాత కొంచెం కొంచెం మైదా వేస్తూ కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్నంతా కరిగిన చాక్లెట్‌లో వేసి బాగా కలపాలి. దానిని రెండు భాగాలుగా చేసి చాక్లెట్ ముక్కల్ని వేసుకుని రెండుసార్లు పన్నెండు నిమిషాల చొప్పున బేక్ చేయాలి. క్రమంగా వేడిని తగ్గించాలి. అప్పుడు కేక్ రెండు భాగాలుగా వస్తుంది. తర్వాత మెరింగ్ టాపింగ్ కోసం ఒక గిన్నెలో గుడ్డులోని తెల్లసొనను బాగా గిలకొట్టి క్రీం ఆఫ్ టార్టర్‌ని వేయాలి. అందులోనే చక్కెర వేసి కరిగాక, బాదం పలుకులు వేయాలి. ఈ టాపింగ్‌ని ముందుగా చేసుకున్న బ్రౌనీ కేక్‌పై పూతలా రాయాలి. దానిపై రెండో కేక్ భాగాన్ని ఉంచి ఓవెన్‌లో అరగంట బేక్ చేయాలి. మెరింగ్ మిశ్రమం బ్రౌన్ రంగులోకి మారాక బయటకు తీసి చల్లారనివ్వాలి. ఫిల్లింగ్ కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ బాగా కలిపి బ్రౌనీ కేక్ పై భాగాన వేస్తే మెరింగ్ బ్రౌనీ కేక్ రెడీ.

నీడతో బొమ్మ

పిల్లలూ ఇక్కడ కొన్ని జంతువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



పదాలు గుర్తించండి

ఇక్కడ క్రిస్మస్‌కి సంబంధించిన కొన్ని వస్తువులు వాటి పేర్లను ఇచ్చాం. పైనున్న అక్షరాల పట్టికలో ఆ వస్తువుల పేర్లు ఎక్కుడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.

Christmas Word Search

L	E	N	I	R	I	A	K	T	O	O	A	A	E	Y	S
N	R	N	R	E	C	H	E	S	R	I	H	O	A	L	F
O	P	Y	R	T	F	S	L	S	S	E	F	E	A	I	M
T	U	D	K	I	Y	H	D	Y	P	S	E	H	T	I	B
E	H	O	L	J	E	R	O	Z	P	N	R	L	N	G	E
F	W	E	S	E	A	T	E	L	M	E	K	M	A	H	L
P	O	C	E	R	M	C	T	E	L	O	E	I	S	Y	L
O	I	S	O	C	K	S	A	M	D	Y	S	S	T	U	S
E	F	N	X	F	D	T	W	R	E	N	A	T	F	E	R
E	G	T	F	S	M	B	A	J	O	M	I	L	I	C	H
H	O	P	H	E	G	C	H	W	T	L	L	E	G	N	A
X	F	O	L	I	R	M	M	S	N	E	S	T	R	S	Y
E	I	L	J	K	Z	A	I	C	H	P	L	O	D	U	R
E	E	H	O	O	N	R	D	R	E	H	P	E	H	S	Q
J	X	O	S	O	H	M	A	R	Q	X	S	A	C	E	R
O	S	W	L	C	I	U	E	R	I	H	H	H	G	J	M



mistletoe	angel
reindeer	bells
rudolph	card
santa	carols
shepherd	christmas
snowman	cookies
socks	gifts
toys	holly
tree	jesus



చిన్నారి చిత్రం

కృతిక 4వ తరగతి మంగళగిరి



క్రిస్మస్ చెట్టుకు రంగులు అద్దండి!

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక బాలీవుడ్ స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫొటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

జ: కీర్తి సురేష్

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నా చుట్టేయండి.





కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఒక ఆకారాన్ని ఇక్కడుంచాం. ఇందులో రెండు అగ్గిపుల్లల్ని కదిపితే ఐదు చతురస్రాలు ఏర్పడతాయి. అదెలాగో మీరే ప్రయత్నించండి.

మాలి మ్యాజిక్ సిస్టర్స్...

పిల్లలూ! మీరెప్పుడైనా మ్యాజిక్ షోకి వెళ్లారా.....లేదా టీవీల్లో వచ్చే మ్యాజిక్ షోని చూశారా! పొడవాటి సూట్, హ్యాట్‌ని ధరించి ఒక వ్యక్తి, చేతిలో పట్టుకున్న కర్రని అబ్రక దబ్రా అని తిప్పేస్తూ అప్పుడే చూపిన వస్తువుని నిమిషాల్లో వేరే ఆకారంలోకి మార్చేస్తుంటాడు. ఇలాంటి మ్యాజిక్‌లని చూసినప్పుడల్లా మీకూ మెజీషియన్ అయిపోవాలనిపిస్తుంటుంది కదా. ఈ మ్యాజిక్ ఏంటో తెలిస్తే హోమ్‌వర్క్ చేయకుండా స్కూల్‌కి వెళ్లినప్పుడు టీచర్ నుండి దెబ్బలు తప్పించుకోవచ్చు అని మీలో చాలా మంది అనుకుంటారు......ఇలాంటివి కాదుగానీ మనం చూసే మ్యాజిక్ షోల్లాంటి ప్రదర్శనలివ్వడంలో ఆరితేరారు మంగుళూరుకి చెందిన అంజనా మాలి(10), అపూర్వ మాలి(8). ఒకటిన్నర సంవత్సరంలోనే ఇంద్రజాలంలో శిక్షణ మొదలెట్టిన ఈ అక్కచెల్లెళ్లిద్దరూ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఇంట్లో అమ్మానాన్నలు కొనిచ్చేబొమ్మలతో ఆడుకోవడం, చదువులోనే కాదు మ్యాజిక్ షోలివ్వడంలోనూ పోటీపడుతున్నారు. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అపూర్వ ఇప్పటికే 400 ప్రదర్శనలిస్తే, 300పైగా ప్రదర్శనలిచ్చింది అంజన. అతిపిన్న చేతి ఇంద్రజాల ప్రదర్శకురాలిగా అపూర్వ, అతి పిన్న మెజీషియన్‌గా అంజన రికార్డులని సొంతం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో వందలాది మ్యాజిక్ షోల ద్వారా అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న ఈ ఇద్దరు అక్కచెల్లెళ్లనీ గత సంవత్సరం లండన్‌కి చెందిన వార్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రపంచ రికార్డ్ సర్టిఫికెట్‌ని అందించడంతో పాటు బంగారు పతకంతో సత్కరించింది. ప్రపంచ స్థాయి ప్రదర్శనల ద్వారా నాలుగు ప్రపంచ రికార్డులనీ గెలుచుకుని 'మాలి మ్యాజిక్ సిస్టర్స్'గా గుర్తింపు తెచ్చుకున్నారు.



పదవికాసం - 46

కూర్పు: రావెళ్ళ

1 పా	వు	2 కో	ళ్ళు	✿	3	4		5
ల	✿	తి	✿	6	✿		✿	
7 కు	ట్ర	✿	8 బ	ది	లీ	✿	9	
డు	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

ఆధారాలు

అడ్డం

1. కొయ్యతో కూడిన పాదరక్షలు (4)
3. బహుమానం (4)
7. మోసం (2)
8. ఉద్యోగానికి ఒక చోట నుండి మరో చోటకి మార్చడం (3)
9. పుష్పదళం (2)
12. ఒక శబ్దాలంకారం (3)
13. తంతు (3)
17. విధం (2)
18. ఒక గ్రామ దేవత (3)
19. ఈదడం (2)
22. పర్యటన (4)
23. అంతరిక్ష యాత్రికుడు (4)

నిలువు

1. ఏలేవాడు (4)
2. వానరడు (2)
4. కొలువు (2)
5. రంగులు వాడే చిత్రకారుడు (4)
6. నమూనా (3)
10. చిక్కు (3)
11. గాలిపటం (3)
15. అంగీకారం (3)
16. దేవుడు (4)
17. వాయు పీడనాన్ని కొలిచే యంత్రం (4)
20. వార్త తెచ్చేవాడు (2)
21. స్త్రీ (2)

సుడోకు

7		2	6		9			1
	6		1	5				7
	1			8	2	3		
				3		5		8
5			8		7		1	
				2				9
		9		7				
	4	6		1				
		8	5					4

గతవారం జవాబులు

6	8	4	7	2	5	9	3	1
7	3	5	1	6	9	8	4	2
9	1	2	3	8	4	5	6	7
2	5	6	4	9	7	3	1	8
8	9	1	2	3	6	4	7	5
3	4	7	5	1	8	2	9	6
1	2	8	6	4	3	7	5	9
4	7	9	8	5	1	6	2	3
5	6	3	9	7	2	1	8	4

1 పా	రా	2 డు	✿	3 ము	మ్మ	4 రం	చే	5 యు
ప	✿	తా	✿	ర్మ	✿	గు	✿	గా
6 శే	ర్షం	✿	7 గ	రు	కు	✿	8 ప	ది
లు	✿	9 ణ	✿	డు	✿	10 బు	✿	✿
11 డు	కు	ణ	గ	✿	12 మ	ధు	ర	13 స
✿	✿	ర	✿	14 ప	✿	డు	✿	మ
15 వె	న్న	✿	16 గ	రి	క	✿	17 గీ	ర
ల్లి	✿	18 క	✿	ష్కా	✿	19 రి	✿	భూ
20 మా	న	వి	హా	రం	✿	గౌ	త	మి

శిఖర యాత్ర

అటు ఇటుగా పదివేల అడుగుల ఎత్తులో ఉండే పర్వత శిఖరంపై హోటల్ చూడాలంటే స్విట్జర్లాండ్‌లోని స్కిల్‌థోర్న్ పర్వతం పైకి చేరుకోవాలి. పర్వత పాదంలో ఉండే ముర్రెన్ గ్రామం నుంచి శిఖరానికి కేబుల్ కార్‌లో ఎక్కేయొచ్చు. చుట్టూ ఆల్ఫ్స్ పర్వత శ్రేణుల అందాల్ని వీక్షిస్తూ ఏటవాలుగా పైకెక్కే ఆ కేబుల్ కార్ స్టెచెల్‌బెర్గ్ నుంచి గిమ్మెల్‌వాల్డ్‌కు, అక్కడి నుంచి ముర్రెన్‌కు... వేరే కేబుల్ కార్‌లలో బిర్గ్‌కు తర్వాత స్కిల్‌థోర్న్‌కు దశలవారీగా పర్వతం ఎక్కుతారు. ఈ కేబుల్ కార్ ప్రయాణం ప్రపంచంలోనే అతి పొడవైన, సవాళ్లతో కూడుకున్న మార్గం. మార్గంమధ్యలో గ్రావుసీలి అనే సరస్సు కూడా దాటతారు. అదే కాదు ఆ పర్వత ప్రాంతం ఉండే బార్నీస్ ఒబెర్‌ల్యాండ్‌కు రైలు ప్రయాణం కూడా మాటల్లో చెప్పలేనంత అనుభూతుల్ని మిగులుస్తుందట. గ్రుట్స్‌చాల్ప్ నుంచి ముర్రెన్‌కు రైలు మార్గం ఉంటుంది. హైకింగ్ చేసేవాళ్లూ ఉంటారు. శిఖరంపై కట్టిన పిజ్ గ్లోరియా హోటల్ సినిమా షూటింగ్‌లకు వేదిక. 55 నిమిషాల్లో 360 డిగ్రీల చుట్టూ తిరిగే ఈ హోటల్ ఓ అద్భుతం. మొత్తం ఆల్ఫ్స్ పానోరమాను వీక్షించే అవకాశం కల్పిస్తుంది. ఇక పైనుంచి కిందకు స్కీయింగ్ చేసే ఇన్‌ఫెర్నో రేసులు మరో విశేషం.

మీ విజయాన్ని ఒక తీపి గుర్తుగా మలచుకోండి!

జైన్ బిందు మరియు భూగర్భ బిందు సేద్యముతో, చెఱకు దిగుబడిని పెంచుతుంది. చక్కెర దిగుబడి మోతాదును పెంచుతుంది.

జైన్ బిందు మరియు భూగర్భ బిందు సేద్యము చెఱకు పంటలో నీటివినియోగము తగ్గిస్తుంది.

- జైన్ డ్రిప్ మరియు భూగర్భ బిందు సేద్యము ద్వారా చెఱకు దిగుబడి గణనీయముగా, ప్రపంచ రికార్డు దాటి 230% అధిక దిగుబడిని పొందినారు.
- పై విధానము ద్వారా చెఱకు పంట దిగుబడి అధికమగుటయే కాక చక్కెర దిగుబడి 0.5% ఎక్కువగావచ్చును.
- జైన్ బిందు మరియు భూగర్భ బిందు సేద్యములో చెఱకు పంటలో నీటి వినియోగాన్ని 60% తగ్గించినది.
- జైన్ బిందు సేద్యము ప్రత్యేకముగా రూపొందించచడబడినది. మెరుగైన పంట మరియు తక్కువ నీటి వినియోగమునకు, సరియైన సమయంలో సరిపోయినంత నీరు ఇచ్చి మట్టిలో వాంచనీయ తేమస్థాయి నిర్వహణ.
  - చెఱకు పుష్కలంగా ఒకేరీతిలో పెరుగుతుంది.
  - పై విధానముద్వారా చెఱకు సేద్యములో నీటి వినియోగపు హెచ్చుతగ్గులు రావు మరియు భూమిలోని తేమ అవసరమగు రీతిలో నిల్వ ఉండును.
- జైన్ బిందు సేద్య పద్ధతి గాలి, నీరు మరియు మట్టితో కలుగు చీడపీడలను నివారించవచ్చును.
- జైన్ బిందు సేద్యపు చెఱకు పంటలో కూలీల ఖర్చు తగ్గును.
- జైన్ బిందు సేద్యములోని ముఖ్యమైన ఫర్టిగేషన్ విధానము వలన పంటకు కావాలిసిన పోషక పదార్థములు సరియైన పాళ్లలో పంటలకు అందును.
- జైన్ బిందు సేద్యపు విధానము నిర్దేశించిన డిజైనులో ఉండుటవలన రైతులు దాని పనితనములో ఎలాంటి ఆందోళన చెందనవసరములేదు.
- ప్రతిఫలం- కొద్ది మోతాదు నీటితో ఎక్కువ చెఱకు పంట మరియు పరిపక్వమునకు వచ్చు కాలముతగ్గును.
- జైన్ వివిధ రకాలైన నీటిపారుదల వ్యవస్థలను అందిస్తుంది- ఎమిటర్స్, టేప్స్, మైక్రోజెట్స్, ఓవర్‌హెడ్ స్ప్రింక్లర్స్ లేదా రైన్‌గన్ స్ప్రింక్లర్స్, భూమి రకాన్ని బట్టి, స్థలాకృతినిబట్టి, నీటినాణ్యతమరియు పరిమాణమునుబట్టి మరియు రైతులు తాము అనుకొన్న రీతిలో పద్ధతులను అమర్చుకొనుటకు వీలుకలదు

visit us at : www.jains.com

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, కెనరా బ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్-080

ఆంధ్ర ఫోన్ నెంబర్లు : 9440797807, 9440797881, 9440797840

తెలంగాణ ఫోన్ నెంబర్లు : 9440797846, 9440797816, 9440797825

టోల్ ఫ్రీ : 18005997899, ఈ మెయిల్ : jainhyderabad@jains.com



వనంలో ఊరేగి..

ఉప్పోయమ్మ ఉప్పనో... ఏనుగమ్మ ఏనుగనో..! అవీ తెలీకుంటే గుర్రమెక్కించుకుంటామనో పిల్లల్ని వీపెక్కించుకుని తిప్పితే.. వినిపించే నవ్వులకి.. కేరింతలకి... అల్లరికి ఆయాసం మరిచిపోతాం. ఇలాంటి ముచ్చట్లలో ఊరేగుతున్నాయి వన్యప్రాణులు. కొన్ని సరదాకి, కొన్ని అనుకోకుండా, కొన్ని కావాలనుకుని, కొన్ని అవసరానికి, కొన్ని కాలక్షేపానికి ఉప్పెక్కేస్తుంటాయి. అలా స్నేహం మొదలెట్టేస్తుంటాయి. జాతి వైరాలు, సరిహద్దు గీటురాయిలు కాసేపు పక్కకు తోసేసి వీపెక్కి కూర్చుంటాయి.



Check List

Book Number	KNSR02B150	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29